C

# రామాయణములో నున్న నిజములు

SOLASA SIVABRAHMAM
ADVOCATE
KAKINADA

శ్రీ స్వామి బాలానంద

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D. P. R. I.
Acc. No.
11075


894.827
BAL

ప్రకాశకులు :
...నంద భక్త బృందము
దేవాలయం వీధి,
కా కి నా డ.

CI

a

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N11075



*Be Constructively Dynamic !*

యువకులారా! ఉప్పొంగు మీ నిర్మాణ కార్యదీక్షయే మాతృదేశ రక్ష!

—స్వామి బాలానంద

(1937లో తీసిన ఫొటో)

T
894.827
BAL

# తొలిపలుకు

పావన గోదావరి తీరమున పాపికొండల మధ్య ఆశ్రమవాసియై భక్తకోటిచే "పేరంటపల్లి స్వామి" అని ఆంధ్రావనిలో పిలువబడుచున్న శ్రీ స్వామి బాలానంద తమ చిన్న వయస్సులోనే దక్షిణేశ్వరం శ్రీ రామకృష్ణ యొక్క ప్రబోధములకును, శ్రీ వివేకానందస్వామి యొక్క కార్యదీక్ష - సేవాతత్పరతకును ముగ్ధులైనారు. ప్రపంచ చరిత్రలోనే మున్నెన్నడు లేని విధముగా ముక్తి మార్గమైన కర్మ సిద్ధాంతమును ప్రపంచము నలుదెసల ప్రచారముచేసిన స్వామి వివేకానంద యొక్క గంభీరము - అమోఘమునైన ఆదేశములను స్వామి బాలానందజీ అత్యంతశ్రద్ధతో అనుసరించి తమ జీవితాదర్శమును మలచుకొన్నారు. వేదకాలమునాటి ధర్మములను పాటించుచు ప్రేమపూరిత హృదయముతో అచటి కొండ జాతులకు అవిరామముగా సేవచేయుచున్నారు. "దరిద్ర నివారణ సేవాసంస్థ'' యను నొక ధర్మ సంస్థను స్థాపించి గిరిజనుల పునరుజ్జీవనమునకై అనేక సంవత్సరములనుండి పాటుపడుచున్నారు. ఒక ప్రక్క ఆ యాదిమవాసుల సంసిద్ధత, మఱియొక ప్రక్క సౌజన్యమైన ప్రజానీకమునుండియు, ప్రభుత్వమునుండియు ఉదారమైన సహకారము, వీరియొక్క కృపావిశేషమువల్లనే లభించినవి. నూటయేడు ఎకరముల భూమిని సంపాదించి ఎకరమునకు ఒక అణా శిస్తుపైన బీదజనులకు పంచిపెట్టినారు. ఆ భూమిలో నాల్గవ వంతు భాగము మెట్ట ప్రదేశమగుటచే దానిని బాగుచేయుటకు కావలసిన ద్రవ్యము నిచ్చి

నారు. అందుగల ఒక ఎకరం విస్తీర్ణమైన చెరువులోని మట్టి త్రివ్వించి చెరువుగట్టు వేయించినారు. ఈ పనుల కన్నిటికి అనేక మంది గవర్నమెంటు అధికారులున్ను ముఖ్యముగా అప్పట్లో రాజమండ్రి కో-ఆపరేటివ్ డిపార్టుమెంటులో డిప్యూటీ రిజిస్ట్రారుగానుండిన కీర్తి శేషులు శ్రీ D. సుందరంగారున్ను సహకరించినారు. శ్రీ సుందరంగారిని స్వామిజీయున్ను వారి భక్త బృందమున్ను "సాధ్యం" అని పిలిచేవారు. ఇది జరిగిన సుమారు 12 సంవత్సరములకు శ్రీ వినోబాజీ భూదానసంస్థను యేర్పరచినారు. "ఇది నేను ఆంధ్ర రాష్ట్రంలో పాదయాత్ర చేయుచూ ఉండగా నాలో స్ఫురించినది. దానిని అనుసరించి యేర్పరచుకున్నా" నని శ్రీ వినోబాజీ వ్రాశారు. మఱల కొన్నిరోజులకు 'శ్రమదానం' అనే సంస్థ కూడా వారు యేర్ప రచినారు. యీ భూదాన శ్రమదాన సంస్థలు రెండున్ను అంతకు 12 సంవత్సరముల క్రితమే ఆంధ్రరాష్ట్రమునకు చెందిన భద్రాచలం తాలూకాలో స్వామిజీ ద్వారా రూపొందినవి.

ఈవిధముగా ప్రజలదృష్టికిగాని ప్రభుత్వముయొక్క సేవకుగాని అందుబాటులో లేని ఆ మారుమూల ప్రాంత ములో 'యాస్' (Yaws) అనే కోయపుండ్లు నిస్సహాయులై యున్న ఆ ప్రజలను తరతరములనుండి పీడించుచుండగా స్వామిజీ విరివిగా వైద్య సహాయముచేసి దానిని రూపుమాపి ఆరోగ్యమనే మహాభాగ్యమును వారికి ప్రసాదించిరి. ఆ గిరి జనులలో కొందఱు బాలబాలికలను విద్యాభివృద్ధికై రాజ మహేంద్రవరములోని పాఠశాలలలో చేర్పించి ప్రత్యేక వసతి

AOVA104 B104



గృహమును ఏర్పాటుచేసినారు. గోచి మాత్రము పెట్టు కొనుచూ బట్టలు ధరించు నభ్యాసములేని యీ బుడుతలకు ప్రేమపూర్వకముగా పరిశుభ్రత, మానవులకు తగుమర్యాదలు నేర్పిరి. స్వామి విరామం లేకుండా చేసిన కృషి ఫలితముగానే నేడు ఆ యాదిమవాసులు ఇతరులవలెనే గౌరవముతోను, ధైర్యసాహసములతోను కొంతవఱకు మానవులకు తగు రీతిని వ్యవహరించగలుగుచున్నారు.

స్వామిజీ అచట స్థాపించుకొనియున్న "శ్రీరామకృష్ణ మునివాటం'' లో నుంటూ నిరాడంబరమైన ఇటువంటి సేవాకార్యములలో నిమగ్నులై వారి ఆధ్యాత్మికౌన్నత్యముతో విశేష ప్రజ్ఞాప్రభావమును మేళవించిరి. ఇటువంటి కార్యక్రమములు వారియొక్క ఆధ్యాత్మిక అభ్యుదయ మాలికలోని సుగంధ పుష్పములు. వారి ఆశ్రమములో కుల, మత, జాతి విచక్షతలకు లోబడకుండ జనులు నలుదిక్కులనుండి వచ్చి దైవప్రార్థన చేసుకొందురు.

విజ్ఞానశోభకు, తపోనిష్ఠకు, భక్తిరసాస్వాదనకు, నిస్వార్థసేవకు పరిపూర్ణ సామరస్యమును స్వామిజీ తమలో నెల కొల్పుకొనియున్నారు. వారియొక్క ఆధ్యాత్మిక ఔన్నత్యమునుగాని, ప్రేమపూరిత హృదయమునుగాని మాటలతో వర్ణించుట సాధ్యముకాదు. వారు భక్తి-జ్ఞాన-కర్మల సమ్మేళనము యొక్క మూర్తియని చెప్పిన చాలును. వారి సన్నిధానమునకు చేరువారి నందఱిని ఉన్నత స్థితికి ఉత్తేజపరచు ఆదర్శమూర్తి.

రామాయణ చరిత్రలోని ఘట్టములను పరిశీలించి స్వామిజీ "Facts in Ramayana" అను పేరుతో ఆంగ్ల భాషలో విమర్శించిన విధానము వారియొక్క సూక్ష్మజ్ఞానము (intuition) ను అంతర్దృష్టి (insight) ని వెల్లడించుచున్నది. త్రివేంద్రములో ఇటీవల జరిగిన "అఖిలభారత రామాయణ సమ్మేళన" సందర్భములో ఆ గ్రంథము ఆవిష్కరింపబడినది. ఆ గ్రంథమునందలి పరిశోధనను ఆంధ్రసోదరుల కందఱకు అందజేయుటకై ఆ గ్రంథమును తెలుగు భాషలోనికి స్వేచ్ఛానువాదము చేయడమైనది. పాఠకు లీ అంశములను గమనించి రామాయణ చరిత్రలోని నిజ విషయములను గ్రహించుదురని ఆశించుచున్నాము.

ఈ యనువాదమును ఇంత త్వరితముగా వెలువరించుటకు దీక్ష - ఆసక్తులతో మాతో సహకరించిన భక్తురాలు కుమారి గరగ సీత (భక్తసోదరులు శ్రీ లక్ష్మీనారాయణగారి కుమార్తె) యొక్క సేవ ప్రశంసనీయము. మఱియు, మా యుద్యమముతో సహకరించి ఈ పుస్తకము నచ్చొత్తించుటకు వలయుధన సహాయము చేసిన భక్తురాలు, పశ్చిమ గోదావరి జిల్లా దుద్దుకూరు వాస్తవ్యురాలు శ్రీ నందిన సత్యనారాయణగారిభార్య శ్రీమతి అన్నపూర్ణమ్మగారికి మా కృతజ్ఞతాపూర్వక అభివందనములు.

బాలానంద భక్త బృందము.

# ఉద్దేశము

రామాయణ చరిత్రలోని అనేక సందర్భములనుగుఱించి ప్రజలలో విధవిధాల అపార్థములు ప్రబలియున్నవని తెలియ చేయుటకును, అందులోగల నిజ విషయములను వెల్లడిచేసి ఆ యపార్థములను సవరించుటకును ఈ రచన ఉద్దేశించబడినది.

రామాయణములోని ఘట్టములలో ముఖ్యమైనవి — (1) సీతా, రామ, లక్ష్మణులు అరణ్యవాసముచేయుటకు కారణభూతమైన విచిత్ర సంఘటనలు. (2) సీతా, రామ, లక్ష్మణుల వనవాసము. (3) దుష్టరాక్షసుడగు మారీచుడు నీచమైన తలంపుతో బంగారులేడివలె రాగా రాముడు దానిని పట్టుటకై వెడలినపుడు సీతాదేవికి లక్ష్మణునకు మధ్యజరిగిన దుర్భాషలు. శ్రీరాముడు అరణ్యవాసమునకు వెడలుటకు దశరథమహారాజు బాధ్యుడని, పరిచారికయైన మంథర దీనికి కారకురాలని అనుకొనుచున్నారు. ఈ యంశములను గుఱించి ఈ గ్రంథములో విమర్శించడమైనది.

ఈ గ్రంథములో కనుపించు విషయములు చూడగా - ఆధ్యాత్మిక గ్రంథములలోను, రామాయణాది పురాణ గ్రంథ ములలోనుగల నిజ విషయములను గ్రహించగల శక్తి ప్రజా నీకములో లోపించియున్నదని స్పష్టముగా తెలియుచున్నది. ప్రపంచమంతయు ఇదే స్థితిలో నున్నది. మానవులలో సహ జముగా గల యీ అశక్తతకును, అందువల్లకలిగిన తప్పు అభి

ప్రాయములకును కారణమేమి? కారణము లనేకములు గలవు. రామాయణ గ్రంథమునకు సంబంధించినంతవఱకు ప్రధానమైన అంశములను వివరించెదము.

శ్రీరామచంద్రుని అవతరణము, వారి జీవితము అనేక వేల శతాబ్దములకు పూర్వము జరిగినవి. ఇప్పటివలె ఆనాడు ఒకచోటినుండి మఱియొకచోటికి వార్తల నంపుటకు తగిన సాధన సౌకర్యములు లేవు. ఒకరి అభిప్రాయములను, భావములను మఱియొకరికి తెలియచేయుటకు వాక్కువల్లనే సాధ్యమగుచుండెను. ఆ రెండవవారు ఇతరులకు తెలియజేయవలెనన్నను అదే విధానము అవలంబించవలసియుండెను. నిరంతరము పరంపరగా ఇటులనే జరుగుచూ వచ్చినది. లిపిలేని ఆ కాలములో మానవులయొక్క స్మృతిలోనే ఇట్టి విషయములు ఉంటూ వచ్చినవి. మానవుల జ్ఞాపకములోనున్న విషయములు కాల క్రమమున మారునట్లు, తగ్గునట్లు, లేనివి వాటిలో కలుగునట్లు అందఱకు తెలిసినవిషయమే. ఈ పరిస్థితిలో అనేక నిజ అంశములు మఱచిపోవుటయును, వాటి స్థానములో నిజముకానివి కలియుటయును జరిగినది. అట్టి తప్పు - ఒప్పులతో కలిసిన విషయములు జ్ఞాపకమున్నంతవఱకు లిపి ప్రారంభమైనతరువాత వ్రాయబడినవి.

ఎట్లనగా—ఒక వ్యక్తికి ఏదో ఒక భావము (feeling) కలిగినది అనుకొందము. ఆ వ్యక్తి ఆ భావమును అనుభవించును (experience); ఆ యనుభవముగుఱించి విచక్షణ

(discrimination) చేయును; విచక్షణ ననుసరించి తనకు కలిగిన భావననుగూర్చి ఒక నిర్ణయమునకు (conclusion) వచ్చును; ఆ నిర్ణయము వారిలో నిశ్శబ్దరూపముగా (silence) దృఢపడి యుండును; నిశ్శబ్దరూపము శబ్దము (sound, or, speech) గా రూపొందును. తదుపరి ఆ శబ్దము లేఖనము, లేక, వ్రాత (character, or, writing) గా రూపొందును. ఈ విధానము ననుసరించి వ్రాతలు ప్రారంభమైనవి.

ఆ వ్యక్తికి కలిగిన భావము ఏ విషయమును గుఱించి అయినదో ఆ విషయమునుగుఱించిన వివరములతో గ్రంథము ఉత్పత్తియగును. అటులనే ఆ భావము సర్వాంతర్యామిని గూర్చి అయినచో సర్వాంతర్యామినిగూర్చి గల వివరణతో గూడిన గ్రంథము ఉత్పత్తియగును. ఇట్లు మొట్టమొదట మూలగ్రంథము ఉత్పత్తియైనది. ఈ విధముగానే అనేక గ్రంథములు తయారైనవి.

ఏ గ్రంథమునైనను చదువునప్పుడు ఆ గ్రంథకర్త యొక్క వ్రాతలోని పైనవివరించిన మార్పులను గమనించుచు అందు అంతరంగముగా ఇమిడియున్న ఆ గ్రంథముయొక్క భావమును మనము గ్రహించవలసియున్నది. అప్పుడు మాత్రమే ఆగ్రంథములో ఇమిడియున్న భావము, వారియొక్క ఉద్దేశము, తిన్నగాను పూర్తిగాను తెలిసికొనగలము. మఱియొక విధముగా చెప్పవలెనన్న, అట్టి భావము, ఉద్దేశము గ్రహించుట కొఱకు ఆ గ్రంథము ఒక వైపు మనకును మఱియొక

వైపు గ్రంథకర్తను — లేదా, గ్రంథము యెవరినిగూర్చి చెప్పుచున్నదో వారికిని — మధ్య వంతెన (bridge) గా యేర్పడియున్నది. అంతేకాక ప్రయోగించిన మాటలకు వేర్వేరు అర్థములుండును; ఒకటికన్న హెచ్చు అర్థములుండును. మఱియు కొన్ని మాటలకు సందర్భానుసారముగా అర్థములు మారును. ఇట్టి పరిస్థితులలో గ్రంథకర్తయొక్కగాని వారు గ్రంథములో యెవరిని గూర్చి చెప్పుచున్నారో వారియొక్క గాని భావమును, ఉద్దేశమును గ్రహించుట కేవలము పాండిత్యము వలన శక్యముకానిది. మఱియొక విశేషము - ఒకవ్యక్తి చదువులేనివాడైనప్పటికి - అంధుడుగా జన్మించినప్పటికిని - ఏ గ్రంథమునైనను ప్రతి దినము కొద్ది క్షణములు పరిపూర్ణ విశ్వాసముతో పట్టుకొన్నంతమాత్రముననే ఆ గ్రంథములోని భావము, ఉద్దేశము ఆ వ్యక్తిలో స్ఫురించును. ఆధ్యాత్మిక గ్రంథములను రచించిన వారిలో కొందఱు చదువులేనివారు, మఱికొందరు పుట్టు అంధులునని తెలిసికొనదగును.

కావున గ్రంథకర్తయందుగాని, ఆ గ్రంథములో నెవరిని గూర్చి చెప్పుచున్నారో వారియందుగాని, దృఢమైన విశ్వాసములేకనే ఆ గ్రంథము చదివినచో అందులో ఇమిడియున్న నిజములను తెలుసుకొనలేరు. అట్టి విశ్వాసము దైవ కృప వలన కలుగును. దైవకృప వ్యక్తియొక్క పాండిత్యము పైగాని, వారియొక్క తపస్సాధనలపైనగాని ఆధారపడినది కాదు. ఆ కృప ప్రవేశించి ప్రకాశించడానికి, అనగా రూపొందడానికి తగు గుణముగలవారు యెవరో వారికే ఆ కృప కలు

గును. దైవము ఎల్లప్పుడును అంతటను ప్రతివారిలోను ప్రతి వస్తువులోను సమానముగా స్థిరమైయున్నది. ఐనప్పటికిని ప్రపంచములో సామాన్యముగా ప్రజలందఱు ఆ దివ్యమగు దైవకృప తమ ద్వారా రూపొందుటకు తగిన స్థితిలో లేరు.

సహజముగా మానవులలో ప్రబలియున్న ఇట్టి అనానుకూలత తొలగించుటకును తగు అనుకూలత కలుగజేయుటకును ఉద్దేశించి రామాయణములోని కొన్ని విషయములలోగల నిజ అంశములను ఈ పుస్తకమునందు విశదపరచడమైనది. ఇందుమూలమున ప్రస్తుతమున్న రామాయణ చరిత్రనుగూర్చి గల తప్పు అభిప్రాయములు తొలగిపోవునని భావించు చున్నాము.

బాలానంద భక్త బృందము.

# రామాయణములోనున్న నిజములు

—•—

## మొదటి భాగము.

దశరథ మహారాజును, సీతాదేవిని, లక్ష్మణస్వామిని— శ్రీరామచంద్రమూర్తిని సహితము—అనేకులు అనేక విధముల విమర్శించి, ఆక్షేపిస్తూ దూషిస్తున్నారు. ఇతరులే కాక హిందువులగు ముఖ్యులుకూడా దూషిస్తున్నారు. అట్టి దూషణకు అవకాశమిచ్చు సందర్భములు కొన్ని ఇచట చెప్పబడినవి- (1) దశరథమహారాజు శ్రీరామచంద్రుని అరణ్యమునకు పంపుట అన్యాయము. (2) శ్రీరామచంద్రమూర్తి తండ్రియొక్క- అన్యాయమైన ఆజ్ఞను అనుసరించుట. (3) సీతాదేవి లక్ష్మణుని యొక్క- ఉద్దేశము శంకించి ఆడరాని మాటలు ఆడుట, దానికి లక్ష్మణుడు ఆడరాని మాటలతో సమాధానము చెప్పుట. ఈ మూడు విషయములను ప్రత్యేక ప్రత్యేకముగా విమర్శించి వాటిలోని నిజమును తెలుసుకొందము.

మహారాజు ఒక సందర్భములో కైకేయితో "నీకు తోచినపుడు నీకు ఇష్టమువచ్చిన రెండు వరములు కోరవలసినది. వాటిని నేను నెఱవేర్చెదను" అని ప్రతిజ్ఞ చేసెను. శ్రీరామచంద్రుని యువరాజుగా పట్టాభిషిక్తుని చేయుటకు ముహూర్తము నిర్ణయించిన దినమునకు ముందురాత్రి రాణి కైకేయి

ఆ రెండు వరములను కోరుకొనెను — మొదటిది, శ్రీరామచంద్రుడు మఱునాడుదయమే అరణ్యమున కేగి పదునాల్గు సంవత్సరములు వనవాసము చేయుట; రెండవది, యువరాజు పట్టాభిషేకమునకు సిద్ధముచేసిన సామగ్రితో భరతునికి యువరాజ పట్టాభిషేకముచేయుట. ఆ కోర్కెలను విరమించుకొనుమని మహారాజు ఎంతగా కోరిననూ, ప్రతిమాలిననూ, ప్రార్థించిననూ వినక రాణి కైకేయి భర్తను నిర్లక్ష్యము చేసెను - అని వివరించబడినది.

శ్రీరామచంద్రునికి యువరాజ పట్టాభిషేకము చేయవలెనని దశరథమహారాజు ఎట్లు నిర్ణయించుట జరిగెనో గమనించుదము. వసిష్ఠమహాముని, మంత్రివర్యులు, అయోధ్య పురవాసులతో నిండియున్న ఆ మహాసభలో దశరథమహారాజు పైనజెప్పిన తన యుద్దేశమును వెల్లడిచేసి సభ్యులయొక్క అభిప్రాయము తెలుసుకొనగోరెను. ప్రజలందఱు హర్షధ్వానములతో ఏకగ్రీవముగా తమ సమ్మతిని తెలిపిరి. అందుపైన మహారాజు సభ్యులతో “మీరందఱును ఏక కంఠముతో నా యుద్దేశమునే, అనగా రామచంద్రునకు యువరాజ పట్టాభిషేకము చేయవలెనని, ఆమోదించినారు. ఎందుచేత? ఇది నా నిర్ణయము కనుకనే మీరు ఆమోదించినారా? లేక, మరియేకారణముచేతనైనా ఆమోదించినారా?”. దీనికి ప్రజలు ఇలా అన్నారు, “మాకు శ్రీరామచంద్రుడే కావాలి. మమ్ము

పాలించుటకు తగినవారు శ్రీరామచంద్రుడే". మొదటిలోనే మహారాజుయొక్క నిర్ణయాన్ని ప్రజలు ఆమోదించినప్పటికిని ఆ నిర్ణయమును ప్రజలే చేసినట్లు మహారాజు నిరూపించుటకు కారణ మేమి? దీనినిగురించి ఇకముందు పరిశీలించుదము.

మహారాజు తన భవనమునకువెళ్లి రామచంద్రుని పిలిపించి ఆ తీర్మానాన్నిగూర్చి చెప్పారు. అయితే ఫలాని రోజున అని ముహూర్తము నిశ్చయించలేదు. మఱల వెంటనే. దశరథుడు రామచంద్రునికొఱకు కబురుపంపెను. మఱల ఇట్లు తనను పిలువవలసిన అవసరమెందుకో అని ఆలోచించి ఈ విధముగా తనలో అనుకొనుచూ తండ్రివద్దకు బయలుదేరెను - "నన్ను యువరాజుగా చేయుటకు తండ్రిగారి కేవైన అడ్డంకులు కలిగనేమో? ఏది ఏమైనప్పటికీ అది నా మేలుకొఱకే" అనికూడా అనుకొన్నారు. తండ్రివద్దకు వెళ్లగానే తండ్రి ఇలా అన్నారు, "రామా! కుమారా! భరతుడు తనకంటె హెచ్చుగా నిన్ను ప్రేమించుచున్నాడని నాకు తెలియును. అయిననూ, చెడుసహవాసముమూలమున కలుగు కీడుకు మిక్కిలి బలము కలదు. నేను కొన్ని దుశ్శకునములను కంటిని. కావున రేపే నిన్ను యువరాజుగా చేయుటకు నిశ్చయించినాను. నీవు సిద్ధము కమ్ము".

రాము డటనుండి వెడలినతరువాత దశరథుడు వసిష్ఠ మహామునిని పిలిపించి యువరాజ పట్టాభిషేకమునకు అవసర

మైన విధులను రామునకు బోధించవలసినదని కోరెను. వెంటనే—సూర్యోదయమునకుముందే—యువరాజ పట్టాభిషేకమునకు వలయు సామగ్రిని సిద్ధముచేయించుమని మంత్రిని ఆదేశించెను. ఈలోగా రాణి కైకేయికి దశరథుని నిర్ణయము తెలియవచ్చినది. ఆమె క్రోధాక్రాంతురాలై స్తంభించిపోయి ఆందోళన చెందెను. అట్టి స్థితిలో ఆమె పరిచారిక మంథర జోక్యముచేసుకొని దగ్గరకుచేరి, "మీరు కౌసల్యాదేవిని ఇది వరలో అనేక పర్యాయములు అవమానపరచియున్నారు. శ్రీరాముడు రాజైనచో ఇకమీద మిమ్ము అవమానపఱచుట కౌసల్యవంతు అగును. మీరు ఆమెకు దాస్యముచేయవలసిన గతి పట్టును. కావున దీనినిగూర్చి దీర్ఘముగా ఆలోచించి సరియైన నిర్ణయమునకు రావలయును" అని సలహా యిచ్చినది. "ప్రతిబంధకముల వత్తిడి హెచ్చుగా నున్నది" అనే వచనమును గుఱించిన్ని, "సమయము మించకుండా—సూర్యోదయమునకు ముందుగానే" అన్న నిర్ణయమును గుఱించిన్ని ఇకముందు వివరించబడును.

ఈ యేర్పాట్లన్నియు అయిన తరువాత దశరథుడు కైకేయి అంతఃపురమునకు వెళ్లెను. అంతకుముందే క్రోధాక్రాంతురాలై ఆందోళనలోనున్న రాణి దశరథునిచూడగానే పూర్వము తనకు రెండు వరములు ఇచ్చి యున్నట్లు, అవి ఇంతవరకును కోరియుండలేదు గాన యిప్పుడు కోరుచున్నానని

చెప్పెను. అవి ఏమనగా, రాముడు పదునాలుగు సంవత్సరములు వనవాసము చేయవలెనని, ప్రస్తుతము రామునకు యువరాజ పట్టాభిషేకమున కమర్చియుంచిన పరికరములతో భరతునకు యువరాజ పట్టాభిషేకము చేయవలెనని – ఇట్లు తన రెండు కోర్కెలను వెల్లడించెను. ఆ కోర్కెలు వినినంతనే రాజు కలవరముచెంది స్మృతి తప్పి నేలపై కొరిగెను. కొంతసేపటికి తెప్పరిల్లి రాజు ఆ రెండు కోర్కెలు విరమించుకొనుమనియు వాటికి బదులుగా మరి వేనినైనగాని – తన సర్వస్వమునైనను – కోరినచో ఇచ్చివేసెదననియు చెప్పి రాణిని బ్రతిమాలెను. "ఈ రాజ్యము నీ కిచ్చివేశాను. ఈ రాజ్యము ఇప్పుడు నీది. ఈ రాజ్యమును నీ చేతులారా రామున కిచ్చి ఆ ఘనకీర్తిని నీవే పొందుము. అందుమూలమున నేనుకూడ జీవించి ఉండ గలుగుదు" నని రాజు పల్కెను. ఇందులకు రాణి సంతోషించి అంగీకరించి అలాగే చేయునని దశరథు డాశించెను.

ఉదయమున మంత్రి రాగానే గత రాత్రియంతయు రాజు గారికి నిద్రలేదని చెప్పి, వెంటనే శ్రీరాముని రాజువద్దకు కొని తెమ్మని కైకేయి మంత్రిని ఆదేశించినది. రాణిగారి ఆజ్ఞ ప్రకారము శ్రీరాముడు వచ్చి స్మృతి తప్పియున్న తండ్రిని చూచి వారి పాదములకు ప్రణమిల్లెను. పరిస్థితి నంతటిని గ్రహించెను. అంతట కైకేయి ఇలా అన్నారు, "రామా!

మహారాజు వ్యాకులచిత్తులై యున్నారు. మాట్లాడుస్థితిలో లేరు. ఇట్టి పరిస్థితినుండి నీవే వారిని రక్షించగలవు. వారిని రక్షించెదనని ప్రతిన చేయు"మని రామచంద్రుని కోరెను. వెంటనే రామచంద్రుడు, "తల్లీ! నా తండ్రికొఱకు ఏమి చేయుటకైననూ నేను సిద్ధముగా నున్నాను. వారికి కావలసిన దేదో సెలవిండు". అని ప్రమాణము చేసెను. అప్పుడా తల్లి "ధర్మశీలుడవైన ఓ రామా! పూర్వము నేనొక సందర్భములో నీ తండ్రిగారిని రక్షించితిని. ఆయన సంతోషించి నన్ను రెండు వరములు కోరుకొనుమని చెప్పెను. ఏమి కోరవలెనో, ఎప్పుడు కోరవలెనో నా నిర్ణయమునకు విడిచిపెట్టెను. నే నిప్పుడు ఆ వరములను కోరితిని. వాని ప్రకారము నీవు పదు నాలుగేండ్లు వనవాసము చేయవలెను. ఇప్పుడు సిద్ధముచేయ బడిన సంబారములతోనే భరతునికి యువరాజపట్టము కట్ట వలెను. కావున నీవు ఈ రోజుననే అరణ్యమునకేగి నీ తండ్రి గారియొక్క వాగ్దానమును నెరవేర్చెదవని నమ్ముచున్నాను" అని శ్రీరామునికి తెలియచేసెను. ఇందు గమనించవలసిన విషయము — శ్రీరామునికి ఈ విషయమును తెలియబఱచినది కైకేయిగాని, దశరథుడు కాదు. ఈ సంభాషణ జరుగు చున్నంతసేపు చాలవరకు దశరథుడు స్మృతిలేక పరుండియుం డెను. స్మృతి వచ్చినప్పుడు "రామా! రామా!" అని దీన స్వరముతో అనుచుండెను. కన్నులయిననూ తెఱువజాల

కుండెను. శ్రీరామచంద్రుడు "అటులనే కానిండు, తల్లీ! నా తండ్రిగారి వాగ్దానమును చెల్లించెద"నని మాట ఇచ్చెను. ఇచ్చట మరియొక ముఖ్య విషయము - తన తండ్రిగారి "ప్రతిజ్ఞ" అని చెప్పెనుగాని తండ్రిగారి "ఆజ్ఞ" అని రాముడు వచించి యుండ లేదు.

అరణ్యమునకు బయలుదేరు నిమిత్తము రామచంద్రుడు సన్నద్ధమగుచుండెను. సీతాదేవి రాముని అనుసరించుటకు నిశ్చయించుకొనెను; కాని లక్ష్మణుడు కోపోద్దీపితుడై "సోదరా! నేనీ అన్యాయమును సహింపజాలను. సైన్యము నంతటిని - భరతుని సహితము - సంహరించి రాజ్యము మీ కప్పగించెదను. అనుజ్ఞ ఇమ్ము" అని వేడుకొనెను. కాని రామచంద్రుడు తమ్ముని వారించెను. లక్ష్మణుడుకూడ తన యన్నగారివెంట జనుటకు నిర్ణయించుకొనెను. ముగ్గురును అయోధ్యను విడచి వనవాసమున కేగిరి.

తరువాత కొలది దినములకే మహారాజు మరణించెను. వారి మృతదేహమును భద్రపఱచుటకు ఏర్పాటుచేసి వసిష్ఠ మహాముని ఆ సమయమున తాతగారివద్దనున్న భరతుని రప్పించుటకు వర్తమానము పంపించెను. అయోధ్యలో జరిగిన వృత్తాంతము భరతునికి తెలియనీయవలదని ఆ వార్తాహరులకు ఆదేశమీయబడెను. ఆలస్యముచేయక గురు ఆజ్ఞగా వెంటనే

బయలుదేరి రావలసినదని మాత్రమే భరతునితో చెప్పవలసిన దని మహాముని అన్నారు. ప్రయాణము చాలా దూరమైనప్పటికి ఆ దూతలు అతి త్వరితముగా కేకయ రాజ్యము చేరుకొని భరతుడున్న రాజధానిలో ప్రవేశించిరి. కేకయ మహారాజు తన మనుమడైన భరతుని కీ వర్తమానము తెలుపగా వెంటనే భరతుడు అయోధ్యకు ప్రయాణమయ్యెను. అతడు మార్గ మధ్యమున అనేక ప్రశ్నలు వేయుదొడగెను. – "నన్నెందుకింత త్వరితముగా రమ్మని కోరినారు? అయోధ్యలో విశేష మేమి? నాకు కొన్ని దుశ్శకునములు కన్పడినవి. అయోధ్యా రాజ్యములో ఏమైనా ఆపద కలిగినదా? ఏమైనా కలిగి యున్నచో దానికి కారకురాలు నా తల్లియేనా? నా సోదరుడు రామచంద్రుడు క్షేమమేనా? నా తండ్రిగారు క్షేమమేగదా?" ఈ విధముగా భరతుడు దూతలను ప్రశ్నపరంపరలు వేయ దొడగెను.

అయోధ్యను చేరుచుండగనే భరతుడు మరల ఇట్లు ప్రశ్నించసాగెను——"పౌరులెవరి ముఖములలోను సంతోషము కన్పింపదేమి? పట్టణములో మామూలు కార్యక్రమములు కూడ కానరావేమి? నా ప్రియ సోదరుడు రామచంద్రుని పట్టాభిషేక మహోత్సవపు అలంకారములు చూడగల నను కొంటిని. కాని ఏమియు కానరావే? వీటన్నింటికి కారణ మేమి?" వనమున కేగుటకు ముందు లక్ష్మణునికి ఎంతగా

ఆగ్రహావేశము కలిగినదో భరతునికి ఈ దృశ్యములు కానరాక పోవుటచే అంతటి ఆందోళన, వ్యాకులత కలిగినవి.

భరతుడు రాజప్రాసాద ఆవరణలోనికి వెళ్ళగానే ఆ వాతావరణము తనను మరింత కలవరపర్చెను. అచటి పరిస్థితిని తెలుసుకొనుటకు ప్రయత్నించుచుండగా ఇంతలో అతని తల్లి కైకేయి సమీపించి కుమారుని కౌగలించుకొని "కుమారా! నీ కొఱకు సర్వస్వమును సంపాదించి సిద్ధముచేసితిని. రాజ్యమంతయు నీదే" యని సంతోషముతో పల్కెను. ఇది వినగానే భరతునకు జరిగినదంతయు బోధపడినది. అతడు తటాలున తల్లిని విడిచి మిగిలిన రాణులైన కౌసల్యాదేవివద్దకు సుమిత్రాదేవివద్దకు వెళ్లెను.

దశరథమహారాజుయొక్క భౌతికకాయమునకు అంత్యక్రియలు త్వరితముగా జరిగినవి. వసిష్ఠమహాముని ఆదేశానుసారము పెద్దలు, అధినేతలు, పురజనులు రాజభవనములో సమావేశమైరి. భరతునికొఱకు వర్తమానము పంపిరి. భరతుడు వచ్చినవెంటనే ఆ మహాముని అతనితో, "భరతా! నీ తండ్రి నీకీ రాజ్యమును అప్పగించెను. కావున ఆలస్యముచేయక సింహాసనము నధిష్ఠించుము. నీ పట్టాభిషేకమునకై అందఱును వేచియున్నారు. అన్నియు సిద్ధముగా నున్నవి. రాజులేని రాజ్యము

ప్రశాంతముగా నుండజాలదు" అని హెచ్చరించెను. కాని భరతుడు "ఓ మునీంద్రా! నన్ను రాజునుచేసినంత మాత్ర మున రాజ్యములో శాంతి నెలకొనగలదా? నిష్కళంకుడైన నా ప్రియతమసోదరుడు శ్రీరామచంద్రునిపై నా తల్లి నా ప్రోద్బలమువల్లనే ఈ కుట్రపన్ని, దేశమున కంతటికిని తీరని అపచారము చేసినదని రాజ్యములో ప్రతి యొక్కరును తలచు చున్నారుగదా? దేశ ప్రజలందరూ నన్ను నిందించుచున్నారే? నేను యీ పరిస్థితిలో సింహాసనము నెక్కినచో మన రాజ్య ములో శాంతి యుండునా? నిర్మలహృదయుడైన నా సోదరుడు రామచంద్రుడు తక్క ప్రపంచములో మరెవ్వరును నేను నిరప రాధినని ఎఱుగరు. ఈ స్థితిలో నాకు పట్టాభిషేకముచేయుట కెట్లు సిద్ధపడిరి? ఈ క్షణమే నేను అరణ్యమునకు పోయి రామ చంద్రుని అచటనే పట్టాభిషిక్తునిచేసి వారిని అయోధ్యకు తీసికొని వచ్చెదను. ఇది నా నిర్ణయము," అని సమాధాన మిచ్చెను. భరతుని నిర్ణయమునకు మంత్రిపుంగవులు, పుర ప్రముఖులు, పౌరులు అందఱును మిక్కిలి హర్షించిరి. వారంద ఱికి భరతునియెడలగల అనుమానము తొలగిపోయెను. అయోధ్యవాసులందఱును — మువ్వురు రాణులుకూడ — భరతునివెంట అరణ్యమునకు వెళ్లుటకును, రామచంద్రుని తోడ్కొని వచ్చుటకును నిశ్చయించుకొనిరి. వారందఱును వసిష్ఠమహామునితో కలసి అరణ్యమునకు బయలుదేరిరి.

పట్టాభిషేకమునకు సిద్ధపరచిన సామగ్రినంతటిని తమతో తీసికొని వెళ్ళిరి. వారి యభీష్టము నెఱవేరునను నమ్మకముతో చతురంగసేనాసమేతముగా అరణ్యమునకు వెళ్ళిరి.

ఈలోపుననే రామచంద్రుని అరణ్యవాసము సంగతియు, అయోధ్యలో జరిగిన సంఘటనలు, మిథిలాధీశుడైన జనక మహారాజునకు తెలియవచ్చినవి. ఈ సందర్భములో భరతుని ఉద్దేశము ఏమిటో తెలిసికొనుటకు ఆ మహారాజు తన గూఢచారులను అయోధ్యకు పంపెను. భరతుడు పరివారముతో అరణ్యమునకు వెడలిన పిమ్మట ఆ గూఢచారులు జనకునివద్దకు తిరిగివచ్చి అయోధ్యలో జరిగిన వృత్తాంతము నంతయు నెఱింగించిరి. “భరతుని సహృదయత నిరుపమానమైనది. జ్యేష్ఠసోదరుడైన శ్రీరామచంద్రునియెడల ఆతనికిగల ప్రేమ ఎట్టిదో చెప్పనలవికాదు. తాను సింహాసనమును నిరాకరించి రామచంద్రుని తీసికొని వచ్చుటకై అరణ్యమునకు బయలుదేరినాడు. సైన్యసమేతముగా వెళ్ళినాడు. — అయితే, సైన్యమును వెంబడి తీసికొనివెళ్ళవలసిన అగత్యము మాత్రము మాకు బోధపడుటలేదు”, అని వారు విన్నవించిరి.

గూఢచారులందించిన వృత్తాంతమును విని జనక మహారాజు తన సైన్యమునుకూడ సిద్ధపఱచి ఎట్టి పరిస్థితినైనను ఎదుర్కొనుటకు సంసిద్ధుడై మరియొక మార్గమున తానుకూడ

అరణ్యమునకు బయలుదేరెను. శ్రీరాముడు, సీతాదేవి, లక్ష్మణుడు ఉన్న చిత్రకూట పర్వత సమీపములో రెండు మార్గములవారు అనగా — అయోధ్యనుండి ఒకటి, మిథిల నుండి ఒకటి — ఇద్దరూ కలుసుకున్నారు. ఉభయులును రామునివద్దకు వెళ్ళారు. సీతారామలక్ష్మణులను చూశారు. వీరు ముగ్గురును తండ్రిగారికి చేయవలసిన క్రియలన్ని చేశారు. మరునాడు వీరు ముగ్గురు ఉన్న ఆశ్రమానికి సమీపములోనే వసిష్ఠమహాముని ఇతర ఋషులను, జనక మహారాజును, భరతుని, అయోధ్యవాసులను—అచటనున్న వారందఱిని సమావేశపరచి, భరతునితో ఈ విధముగా చెప్పెను, "భరతా! నాకొక ఆలోచన తట్టినది. దాని ననుసరించినఎడల ప్రస్తుతము మనలనెదుర్కొనియున్న క్లిష్టసమస్య పరిష్కారము కాగలదు. అది యేమనగా, రామునికి బదులుగా నీవు పదునాల్గు సంవత్సరములు వనవాసము చేయవలెను. రాముడు అయోధ్యకు తిరిగిరావలెను". అది విని భరతుడు సంతోషభరితుడయ్యెను. తాను తాతగారి ఇంటివద్ద మహామునియొక్క వర్తమానమును వినినప్పటినుండి ఇంతవరకును భరతునిముఖమున సంతోషము కనబడలేదు. ఇతడు సంతోషించుట ఇదే మొదటిసారి. మహామునియొక్క సలహాను విని అతడు సంతోషముతో ఉప్పొంగిపోయెను. వెంటనే దానిని అనుసరించుటకు సంసిద్ధుడయ్యెను. రామునియెడల భరతునికి ఎంత అపారమైన

ప్రేమ, భక్తి గలవో అని అచట చేరినవారందఱికి స్పష్టమైనది. అందఱును భరతుని స్తుతించసాగిరి. "భరతుడే రాముడు — రాముడే భరతు"డని ఘోషించిరి. ఈ అంశములకు సంబంధించిన నిజములనుగూర్చి ఇకముందు వివరించుదము.

రామచంద్రుని దృఢనిశ్చయమునుండి మరల్చుటకు చేసిన ప్రయత్నములన్నియు నిష్ఫలమయ్యెను. శ్రీరాముడు తన మామగారైన జనకమహారాజుతో యీ విధంగా కోరినారు. "మీరుకూడా భరతునితో అయోధ్యకు వెళ్ళి రాజధానిలో సైనికదళాలను, భాండాగారమును, రాజ్యపరిపాలనావిధానమును చక్కదిద్ది పిదప మిథిలాపురికి వెళ్ళవలసిన"దని కోరినారు. భరతుడు రామచంద్రునియొక్క పవిత్రమైన పాదుకలను వెంటబెట్టుకొని అయోధ్యచేరి, ఆ పాదుకలను సింహాసనముపై నుంచి తన బాధ్యతను నిర్వర్తించుచుండెను. పిమ్మట శ్రీరాముడు చిత్రకూటమునుండి పర్ణశాలకు వెళ్లెను.

పర్ణశాలవద్ద నుండగా సీతాదేవి మిక్కిలి సౌందర్యముగల ఒక లేడిని చూచి దానిని పట్టితెమ్మని రామచంద్రుని కోరెను. ఆ లేడిని పట్టుటకై బయలుదేరునప్పుడు లక్ష్మణునితో రామచంద్రుడు "సీతాదేవిని రక్షించుచూ, నేను తిరిగి వచ్చునంతవరకు ఇచ్చటనే యుండనలసినది" అని ఆజ్ఞాపించి వెళ్లెను. దానిని పట్టుకొనుటకై రామచంద్రుడు పర్ణశాలనుండి కొంత

దూరము వెళ్ళవలసి వచ్చెను. దానికి హాని కలుగకుండా ప్రాణముతో పట్టుటకు సాధ్యపడలేదు. అందుచే రాముడు దానిపై ఒక బాణమువేసెను. అంతట అది "హా! సీతా" "హా! లక్ష్మణా" అని అఱచుచూ క్రిందపడి చనిపోయినది. సీతాదేవికిని, లక్ష్మణునికిని ఈ కేకలు వినిపించినవి. ఆ యఱపులు లక్ష్మణుడు తిన్నగా తెలుసుకొన్నారు. ఇది రాక్షసుల మాయయని గ్రహించెను. కాని, సీతాదేవి రామచంద్రునకేదో హాని కలిగినదని తోచి రాముని రక్షణార్థము వెంటనే వెళ్ళవలసినదని లక్ష్మణునితో చెప్పెను. లక్ష్మణుడు ఆ యఱపులలోని నిజాన్ని సీతాదేవికి తెలియజేసి రామచంద్రుని కెట్టి హానియు కలుగలేదని — కలుగబోదని — తాను అన్నగారి సహాయార్థమై వెళ్ళనక్కఱలేదని జవాబిచ్చెను. సీతాదేవి ఎంత బ్రతిమాలినను తన యభిప్రాయమే సరియైనదనుచు లక్ష్మణుడు వెళ్ళుటకు నిరాకరించెను. పైగా తాను తిరిగివచ్చునంతవరకు పర్ణశాలను విడువరాదని రాముడే ఆజ్ఞాపించిన విషయమును సీతాదేవికి గుర్తుచేసెను. అంతట ఆమె లక్ష్మణుని యుద్దేశమును శంకించుచూ, "లక్ష్మణా! నీవు ఏదో దురుద్దేశముతో మాతో అరణ్యమునకు వచ్చినట్లు నాకు తోచుచున్నది. కావున వెంటనే నీ యన్నగారిని రక్షించుటకు వెడలనియెడల నేను అగ్నిలో దుమికి ప్రాణములు విడిచెద"నని నిష్ఠూరముగా పలికెను. దీనిపైన లక్ష్మణుడు

"నీవు సామాన్య స్త్రీవని నాకు ఇప్పుడు తోచుచున్నది." అంటూ "వెళతా"నని చెప్పుతూ, "మేము ఇద్దరము తిరిగి వచ్చునపుడు నీవు ఇక్కడ కనిపించవేమో" అని కూడా చెప్పి రామునికొఱకు బయలుదేరెను.

లేడిని చంపి తిరిగి వచ్చుచున్న శ్రీరాముడు మార్గ మధ్యమున లక్ష్మణునికి ఎదురయ్యెను. సీతను విడిచి ఏల వచ్చితివని శ్రీరాముడు ప్రశ్నించగా లక్ష్మణుడు తనకును, సీతాదేవికిని మధ్య జరిగిన సంభాషణ నంతటిని చెప్పెను. ఉభయులును తిరిగి పర్ణశాలను చేరుసరికి సీతాదేవి కన్పించ లేదు. వారిద్దఱును లేని సమయములో క్రూరుడైన రావణా సురుడు ఆమె నపహరించి తన లంకారాజ్యమునకు గొని పోయెను. సీతను గానక రామచంద్రుడు కోపమువి - చారము ముప్పిరిగొన కల్లోలముతో సీతాదేవికొఱకు ఎల్లయెడల వెతుకసాగెను. లక్ష్మణు డది చూచి "సోదరా! ఆందోళన చెందకుము. అప్పుడప్పుడు సీతాదేవికి దాగుడుమూతలాడుట అలవాటే కదా! ఇప్పుడుకూడ ఏ పొదచాటునో దాగి యుండవచ్చును. కావున ఆమె దాగియుండు ప్రదేశములను వెదకుదము, రమ్ము". అని హెచ్చరించెను. పర్ణశాల వృత్తాం తములో ఇది మిక్కిలి విశేషమైన ఘట్టము.

రామాయణచరిత్రలో ఇంతవరకు 'అయోధ్య', 'మిథిల', 'చిత్రకూటము', 'పర్ణశాల'—ఈ నాలుగు ఘట్టములకు సంబంధించిన పదునేడు ముఖ్యాంశములను గమనించితిమి. వీటిలో పన్నెండు అంశములు అయోధ్యకు, రెండు అంశములు మిథిలకు, రెండు అంశములు చిత్రకూటమునకు మిగిలిన ఒక అంశము పర్ణశాలకు సంబంధించినవి. ఈ అంశముల నన్నిటిని సూటిగా పరిశీలించి అందలి నిజముల తెలుసుకొందము.

---

# రామాయణములోనున్న నిజములు

## రెండవ భాగము

—•—

### 1. అయోధ్యలోని రాజసౌధము :

రామచంద్రునికి యువరాజపట్టాభిషేకము చేయవలెనని దశరథమహారాజు తాను చేసికొనిన నిర్ణయమునే అయోధ్య పురవాసులు, మంత్రులు, మునులు మొదలగువారే నిర్ణయించినట్లుగా నిరూపించదలచుటకు కారణమేమి? రామాయణ గ్రంథములో దీనికి తగు కారణము కానరాదు. అయినను ఇట్లు జరిగినట్లు కన్పించుచున్నది. అందుచే దానికి — అనగా, ఇట్లు నిరూపించడానికి — అవసరము ఏదో ఉన్నది. అది సూక్ష్మముగా నున్నది. ఆ యవసరము ఏమై ఉండును? రాజ్యాధిపత్యమునుగూర్చి ఏదైన ఒక వివాదమో, కుట్రయో ఉండి యుండవలెను. అది అందరికి తెలిసినదే అయి ఉండవచ్చును. అంతేకాక ఆ వివాదము అయోధ్యరాజ్యములో కొంతకాలమునుండి ప్రబలియుండవలెను. అందువలన ఈ సభలో ప్రతిపక్షమువారెవరైన ఉన్నారా? అని తెలిసికొనుట కొఱకై సభ్యులను మహారాజు పరీక్షించెను. "సభ్యులారా! నా నిర్ణయమును మీరందరూ ఏకగ్రీవముగా ఆమోదించుటకు

కారణమేమి? ఈ నిర్ణయము నేను చేసినందువలననా? లేక మీ అంతట మీకే రాముడు ఉండవలెనని తోచినదా?" అని ప్రశ్నించెను. దీనికి సభలోనివారందఱు "కాదు! కాదు! రాముడే మాకు రాజై యుండవలెను. ఎందుచేతననగా రాముడే ఈ రాజ్యమును పరిపాలించుటకు తగినవారు", అని ఏక కంఠముతో సమాధానమిచ్చిరి. దీనిలో ఒక ముఖ్యవిషయ మును గమనించవలసియున్నది. అదేమనగా — "రామచంద్ర మూర్తియే ఈ రాజ్యము పరిపాలించడానికి తగినవారు'' అనే వాచకము. సాధారణముగా అటువంటి సభలో సభ్యులు రాజు అడిగిన ప్రశ్నకు మరియొకవిధముగా సమాధానము ఇచ్చి యుండవలెనే! ఆ సమాధానము ఏమి? — "రాముడు రాజు యొక్క పెద్దకుమారుడు. అందుచే ఈ రాజ్యమును రాముడే పరిపాలించవలెను," అని. అయితే సభ్యులు ఈలాగున చెప్పక రాముడే ఈ దేశ పరిపాలనకు తగినవా రన్నారు. అంతేకాక పెద్దకుమారుడని ఎవరూ అన లేదు. దీనికి తగు కారణ ముండ వలెను. అది యేమై యుండును?

చరిత్రలో చెప్పినప్రకారము దశరథమహారాజునకు సంతానము లేకపోయినందున రాజు కేకయదేశ రాజకుమార్తె అయిన కైకేయిని వివాహాము చేసికొనెను. ఆ సందర్భములో కేకయరాజు ఇలా కోరినారు, — తన కుమార్తెకు కలిగిన

పుత్రునకే అయోధ్యదేశము చెందవలెనని. అనగా ఆమె పుత్రుడే రాజు కావలెను. దీనికి మహారాజు అంగీకరించి ప్రతిజ్ఞచేసెను. ఈ సంగతి ప్రజలందరికి తెలిసినదే. దీని నాధారముగాచేసికొనియే కొంతకాలమునుండి భరతుని యువ రాజుగా చేయవలెనని కైకేయి మహారాజును కోరుచూ ఉండవలెను. ఈ విషయము సహితము ప్రజానీకమునకు తెలిసి యుండవచ్చును. ఆ కారణముచేతనే మహారాజు ఏర్పరచిన సభలో రామచంద్రుడే జ్యేష్ఠుడు కనుక అతడే రాజుగా ఉండ వలెనని సభవారు తీర్మానించక, రాముడే రాజ్యానికి తగినవారని తీర్మానము చేశారు. ఈ ఘట్టమునకు సంబంధించిన అన్ని అంశములను గురించి చూడగా మహారాజు తాను చేసిన నిర్ణయమును సభలో పురజనులు చేసినట్లు నిరూపించడానికి కారణము ఇదియే అని విశదమగుచున్నది. అంతియేకాక మహారాజు ఇదివరలో చేసిన ప్రతిజ్ఞప్రకారము రాజ్యమును తనకే ఇవ్వమని తండ్రిని కోరవలసినదని కైకేయి భరతుని ప్రోత్సహించి, నిర్బంధిస్తూ ఉండవచ్చును. కాని భరతుడు తన ప్రేరేపణకు, నిర్బంధనలకు ఎంతమాత్రము లోబడలేదు. జ్యేష్ఠ సోదరుడగు రామచంద్రునికి సేవ చేయుటకంటె ప్రధానమైన దేదియు భరతునకు కన్పించలేదు. కావున రాముని సేవించు టకే అతడు దృఢనిశ్చయుడై యుండెను. తల్లియొక్క ఒత్తిడి సహించలేక తన తాతగారివద్ద కొన్నాళ్లు ఉండుటకు నిశ్చ

యించుకొని యుండవచ్చును. తనయొక్క పరిస్థితులను తండ్రి గారితో చెప్పి తాను, తండ్రిగారు, వసిష్ఠమహాముని—ముగ్గురును ఆలోచించుకొని కొన్నాళ్లు తాను తాతగారివద్ద కేకయ పురిలో ఉండటానికిని ఆ రోజులలో, అనగా, తాను అయోధ్యా పురిలో లేనప్పుడు, రామచంద్రుని యువరాజుగా పట్టాభిషేకము చేయడానికిని నిర్ధారణ చేసియుండవచ్చును. ఈ నిర్ధారణ ననుస రించియే భరతుడు తన తాతగారివద్దకు వెళ్లి అచ్చట ఉండెను. యువరాజపట్టాభిషేక మహోత్సవము ఏ రాజ్యములోనైనను అతి బాహాటముగా, అట్టహాసముగా, జరుగునేగాని గోప్యముగా జరుగదు. ఐనప్పటికిని భరతుడు లేకుండగనే చేయుటకు సిద్ధ పడినారు. అంతేకాక దశరథుని ముఖ్య బంధువైన జనక మహారాజునైనను ఆహ్వానించలేదు. ఈ సందర్భములన్నిటిని బట్టి చూడగా అయోధ్యలో జరిగిన సంఘటన పైన వివరించిన విధముగానే జరిగియుండునని స్పష్టమగుచున్నది. అయోధ్యలో జరిగిన మహాసభలో శ్రీరామునికి పట్టాభిషేకము జరుపుటకు మాత్రమే నిర్ణయమైనది; కాని దానికి ముహూర్తము నిర్ణ యించబడకపోవుట ఈ సందర్భములో గమనించదగినది.

## 2. మహారాజ సౌధము :

సభ ముగిసినతరువాత దశరథుడు తన సౌధమునకేగి రాముని రమ్మని వర్తమానము పంపెను. శ్రీరాముడు రాగానే,

"నా ప్రియకుమారా! రామా! భరతుడు నిన్ను తన ప్రాణము కంటె హెచ్చుగా ప్రేమించుచున్నాడని నే నెఱుగుదును. ఐనను దుస్సహావాసముయొక్క ఒత్తిడి మిక్కిలి బలమై యున్నది. నాకు కొన్ని దుశ్శకునములు కనబడినవి. కావున నీ యువరాజపట్టాభిషేకము రేపే జరుపవలెనని నాకు తోచినది. నీవు దానికి సిద్ధముకమ్ము" అని పల్కెను. ఆ దుస్సహావాస మెవరిది? – కైకేయిదే. సింహాసనమునుగుఱించిన కలహము బహిరంగముగానే యున్నదని, అది హఠాత్తుగా పుట్టినది కాదని, చాలకాలమునుండి వచ్చుచున్నదని ఇది చూపించు చున్నది. అంతేకాక ఈ సంగతి మొదటి అంశములో తేలిన నిజమును బలపఱచుచున్నది.

### 3. దశరథుడు వసిష్ఠమహామునిని కోరుట :

యువరాజపట్టాభిషేకము "మరునాడే" జరుగుటకు సిద్ధముకమ్మని దశరథుడు రామునితో చెప్పి అందులకు అవసర మైన ఏర్పాట్లను తెల్లవారుటకు ముందుగానే సిద్ధముచేయవల సినదని మంత్రిని ఆదేశించెను; మరియు యువరాజగుటకు రాముని సిద్ధపరచవలసినదని వసిష్ఠమహామునిని కోరెను. ఆ ప్రకారము అన్ని ఏర్పాట్లు జరిగినవి. యువరాజపట్టాభిషేకము నకు కావలసిన సామగ్రులు, ఇతర ఏర్పాట్లు ఒక్కరాత్రిలో సేకరించి సిద్ధపఱచుటకు శక్యమగునా? కాదు. అయితే అది

ఎలాగున జరిగినది? దానికి కావలసిన సామగ్రులన్నియును సేకరించుట, ఇతర ఏర్పాట్లు—ఇవి అన్నియు మంత్రి అంతకు పూర్వమే సిద్ధముచేసి యుండెను.

దీనినిబట్టి రామునికి యువరాజపట్టాభిషేకము జరుపుటకై దశరథమహారాజు, వసిష్ఠమహాముని, భరతుడు—ఈ ముగ్గురును ఆలోచించి నిశ్చయించుకొని తగు ఏర్పాట్లన్నియును అంతకుముందే చేసినట్లు స్పష్టమగుచున్నది. కనుక రాజసభలో యువరాజపట్టాభిషేకమును గురించి ప్రస్తావించుటలో దశరథమహారాజు ఉద్దేశము ప్రతిపక్షమైన కైకేయికి తోడ్పడువా రెవరైన ఉన్నారా? అని తెలిసికొనుటకొఱకుమాత్రమే అని విశదమగుచున్నది.

ఇవన్నీ చూడగా కొంతకాలమునుండియే ఈ కుట్ర రాజధానిలో ప్రబలియున్నట్లు తేలుచున్నది.

### 4. కైకేయి భవనము :

మరునాడే శ్రీరామునికి యువరాజపట్టాభిషేకము చేయుటకు దశరథమహారాజు నిశ్చయించినట్లు తెలిసినతోడనే కైకేయి క్రోధాక్రాంతురాలై కలవరపడినది. ఆ సందర్భమున ఆమెకు దూరపుబంధువును, పరిచారికయు అయిన మంథర జోక్యము కల్పించుకొని కైకేయితో, "ఇదివరలో నీవనేక

సార్లు కౌసల్యాదేవిని అవమానపఱచియున్నావు. రాముడు యువరాజైనచో ఇకముందు నిన్ను అవమానపరచుట కౌసల్య వంతు అగును. అందువలన నీవు కౌసల్యాదేవికి దాస్యము చేయవలసివచ్చును. కావున ఈ విషయమునుగూర్చి దీర్ఘముగా ఆలోచించి సరియైన నిర్ణయమునకు రమ్మ''ని బోధించెను. "అనేక పర్యాయములు కౌసల్యను అవమానపఱచితివి."—దీనినిబట్టి రాజసౌధములో పరిస్థితులు తిన్నగా లేవనియును, రాణులలో భేదభావాలు తీవ్రముగానున్నట్లును స్పష్టమగుచున్నది. ఇతర రాణులకంటె కైకేయియందే దశరథుడు ఎక్కువ అభిమానము చూపినట్లు చరిత్రలో కనిపిస్తున్నది.

ఇలా ఉండగా—అనగా, కైకేయియందు దశరథునకు ఎక్కువ అభిమానము ఉన్నపుడు, కైకేయి కౌసల్యను అగౌరవపర్చవలసిన అవసర మేమొచ్చినది? కౌసల్యయెడల విరుద్ధానికి అవకాశము ఎక్కడ ఉన్నది? కాని కౌసల్యకు కైకేయియెడల విరుద్ధము అని అగుపించినచో దానికి అవకాశమున్నది. కాని ఆలాగున అగుపించుటలేదు కదా! దీనికి కారణ మేమై ఉంటుంది? రాణులలో ఒకరిపై ఒకరికి విరుద్ధానికి స్వల్పవిషయము కారణము కాజాలదు. అందులో కౌసల్య పెద్దరాణి గనుక ఆమెనే అనేకపర్యాయములు అగౌరవపఱచినపుడు ఏదో ఒక ముఖ్యమైన ప్రత్యేకకారణమే ఉండియుండవలెను.

కావున పై పరిస్థితులన్నిటిని గమనించి దశరథమహా రాజు కేకయరాజుకు ఇచ్చిన ప్రతిజ్ఞ ననుసరించి అయోధ్య దేశపు సింహాసనముపై భరతునికిగల "హక్కు"నకు సంబంధించి ఆ విరుద్ధము పుట్టి ప్రబలియున్నదనుటకు సందేహములేదు.

## 5 కైకేయి తన తండ్రి కేకయరాజుకు వర్తమానము పంపుట

"నా కుమారుడు అయోధ్యకు యువరాజు కానిపక్షములో నేను బ్రతికియుండగా మీరు నన్ను చూడజాలరు. నా మృతకళేబరమును మాత్రమే చూడగలరు. ఇది నాయొక్క కడపటి ఉత్తరము." అని కైకేయి మంథరద్వారా తనతండ్రికి వర్తమానము పంపెను.

ఈ సందేశము ఎంతటి వినాశకరమైనది. ఈ సందేశమును పంపినపుడు భరతుడు తాతగారిఇంటివద్దనే ఉండెను. ఈ సందేశమును పంపుటకు పూర్వముండిన పరిస్థితులను, తరువాత జరిగిన సంఘటనలనుగూర్చి చూడగా భరతుని యువరాజపట్టాభిషేకమునుగుఱించి చేసియున్న వాగ్దానమును నెఱవేర్చునట్లుగా దశరథుని బలవంతపెట్టవలసినదని ఇంతకు పూర్వముకూడ కైకేయి పదేపదే తనతండ్రిని ప్రేరేపించినట్లు విశదమగుచున్నది. కాని, కేకయరాజు ఈ ఉద్దేశాన్ని అనుసరించలేదు. వారు అనుసరించకపోవుటకు కారణము లేమైనప్పటికిని, ఎన్ని యున్నప్పటికిని, భరతునికి రామునియందుగల

నిష్కళంక భక్తియే ముఖ్యకారణమై యుండవచ్చును. అందు వలన భరతుని పట్టాభిషేకముగూర్చి కైకేయి దశరథుని నిర్బంధించుట హఠాత్తుగా జరిగినదికాదని, చిరకాలమునుండి వచ్చుచున్న అంతఃపుర కలహమని, ఋజువుచేయుటకు ఈ సందర్భమొక్కటియే చాలును.

### 6. ఆ చీకటి సూర్యోదయము :

యువరాజ పట్టాభిషేకమునకై సిద్ధమగుచున్న శ్రీరాముని తనవద్దకు తోడ్కొనిరమ్మని కైకేయి మంత్రిని ఆజ్ఞాపించెను. మంత్రి ఆ యాజ్ఞప్రకారము రాముని ఆమెవద్దకు తీసుకొనివచ్చెను. దశరథమహారాజు ఆ సమయమున స్మృతి తప్పి పడియుండెను. కైకేయి శ్రీరామునితో, "మహారాజు వ్యాకులచిత్తులై యున్నారు. మాట్లాడుస్థితిలో లేరు. ఈ విపత్తునుండి నీవే వారిని రక్షించగలవు. వారిని రక్షించెదనని ప్రతిన చేయు"మని చెప్పినది. దానికి సమాధానముగా, "నా తండ్రిగారికొఱకై నేను ఏమిచేయుటకైనను సిద్ధముగా నున్నానని మీయెదుట ప్రమాణము చేయుచున్నాను. అమ్మా! తండ్రిగారి కోరికయేమో తెలియచేయవలసిన"దని శ్రీరాముడు కోరెను. అంతట కైక ఇట్లనెను—"రామా! నీవు ధర్మశీలుడవు. ఒక ప్రత్యేకపరిస్థితిలో నేను నీతండ్రిగారగు రాజును రక్షించితిని. అందులకు సంతసించి వారు నాకు రెండు వరము

లొసగిరి. ఏవరములు కోరవలెనో, వాటిని ఎప్పుడు కోరవలెనో అను విషయము నా ఇష్టమునకు విడిచిపెట్టిరి. ఆ వరములు నే నిప్పుడు కోరితిని. వాటిప్రకారము నీవు పదునాల్గు సంవత్సరములు అరణ్యావాసము చేయవలెను. మరియు నీ యువరాజపట్టాభిషేకమునకు సిద్ధపరచిన సామగ్రితోనే భరతుని యువరాజుగా పట్టాభిషిక్తుని చేయవలెను. కనుక నీవు ఈరోజుననే అరణ్యమునకు వెళ్ళి నీతండ్రిగారు నాకు చేసిన ప్రతిజ్ఞ నెఱవేర్చి, నీతండ్రిగారిని కాపాడుదువని దృఢముగా నే ననుకొనుచున్నాను." ఇక్కడ గమనించవలసిన ముఖ్య విషయమేమనగా, ఇవన్నియు రామునితో రాణి చెప్పినవే గాని, రాజు చెప్పినవి కావు. మరియు "రాజు నాకు చేసిన ప్రతిజ్ఞ" అని చెప్పెను. ఇచ్చట ఒక విషయము గమనించ వలసియున్నది. శ్రీరాముడు అరణ్యావాసము చేయవలసినదని, భరతునికి పట్టము గట్టవలెనని, ఆజ్ఞాపించినది రాణియే గాని రాజు కాదు. రాణియే రాముని అరణ్యవాసమునకు పంపినది. ఇదియేకాక ఇంతకు ముందు రాముని తీసుకొనిరమ్మని మంత్రిని ఆజ్ఞాపించినదికూడ రాణియే.

మఱియొక ముఖ్యమైన విషయము ఈ సమయమున గమనించవలసియున్నది. — దశరథుడు జీవించియుండగనే కైకేయియొక్క ఆజ్ఞను మంత్రి అనుసరించెను. అది ఎట్లు జరిగినది? దానికి కారణమేమిటి? కైకేయి పెద్దరాణి అయినను

కాదు. ఇది మిక్కిలి అసాధారణము. జరుగరానిది అయినప్ప టికిని అట్లు జరిగినది. అందుచే దానికి బలవత్తరమైన ఆధార మేదో ఉండవలెను. ఆయాధార మేమై యుండును? అది ఈ క్రింద చెప్పునదే అయి ఉండవలెను.

ఆ రాత్రి కైకేయి కోరిన వరములు వినగానే దశరథ మహారాజు దుఃఖితుడై ఆవేదనపడుచు ఎటులైనను కైకే యికి వివేకము కలుగునేమోయని యాశించి కైకేయితో నిట్లు పల్కిరి. "ఈ రాజ్యము నీకిచ్చివేసినాను. ఇప్పుడు ఈ రాజ్యము నీదే. నీవే ఈ రాజ్యమును రామునికి ఇచ్చి ఆ ఘనకీర్తిని నీవే పొందుము. అందు మూలమున నేనుకూడ జీవించియుండగల్గుదును." ఆ క్షణమునుండి మహారాజు యొక్క ఆజ్ఞను ఆధారముగా చేసికొని రాజ్యము తనదేనను భావముతో కైకేయి వ్యవహరించసాగెను. ఆ చీకటి సూర్యో దయ దినమున మంత్రి తన భవనమునకు రాగానే ఈ విష రము — అనగా రాజ్యమును రాజు తనకు ఇచ్చివేసెను — అను వివరమును మంత్రికి తెలిపి యుండును. ఈ వివరము తెలి యకనే వసిష్ఠమహాముని నాయకత్వములో పురజనులందరు శ్రీరామచంద్రుని యువరాజ పట్టాభిషేకమునకు కావలసిన సామగ్రులతోను, సకలసన్నాహములతోను రాజసౌధద్వార ములో సమావేశమై యుండిరి. శ్రీరామచంద్రుని రాకకై ఉత్సాహముతో కాచుకొని యుండగా ఆ మహామునితో

కూడ సంప్రదించకనే – వారికి తెలుపుటయైనను చేయకనే– సామాన్యునివలె శ్రీరాముని తన వెంట రాణివద్దకు మంత్రి తోడ్కొనిపోయిరి. రాణి ఆజ్ఞను మంత్రి శిరసావహించుటకు అదియే కారణమై యుండవలెను. రామునికి ఆశ్చర్యము కల్గినది.

ఇది జరిగిన తరువాత శ్రీరాముడు వనవాసమునకు వెడలినంతవరకు జరిగిన సందర్భములన్నియు పైన వివరించిన నిజములను అనుసరించియే ఉన్నవి. సూటిగా చెప్పవలెనన్న రాజ్యానికి యజమాని అయినందువల్ల రాణి తానే శ్రీరా ముని అడవికి వెళ్లుమని ఆజ్ఞాపించెను. ఈ విషయము మహా రాజు ఎఱుగరు. ఇవన్నియు జరుగువరకు మహారాజుకు స్మృతి లేదు, మాట లేదు.

7. "నా తండ్రిగారి ప్రతిజ్ఞను నేను నెరవేర్చెదను", అని శ్రీరాముడు కైకతో చెప్పెను. ఇందులో తెలుసుకోవలసిన దేమనగా రాముడు చెప్పినది తండ్రిగారి 'ప్రతిజ్ఞ' అనేగాని తండ్రిగారి 'ఆజ్ఞ' అనికాదు. అనగా తండ్రిగారు నీకు (రాణికి) చేసిన ప్రతిజ్ఞ. ఎందుచేతననగా శ్రీరాముని ఆజ్ఞాపించినది రాణియే. ఆ సందర్భమున రాముని యొక్క ఆఖరి వచనము పైన చెప్పిన నిజములను స్థిరపరుచుచున్నది. అది ఏమనగా "ఈ సంగతులన్నియు మహారాజే నా కెందుకు చెప్పియుండ

లేదు." ఈ వచనములోని మాటలు "ఎందుకు చెప్పి యుండ లేదు" అనగా "ఎందుకు ఆజ్ఞాపించలేదు" అని యర్థము.

## 8 కౌసల్యాదేవి అంతఃపురములో :

వెంటనే శ్రీరాముడు కైకేయివద్దనుండి తన తల్లి కౌసల్యాదేవివద్దకు సెలవుతీసికొనుటకు వెళ్లెను. పట్టమహిషి అయిన కౌసల్యాదేవి ప్రస్తుత పరిస్థితులను తెలిసికొని తన కుమారుని ఆశీర్వదించి అతని కర్తవ్యమును నెరవేర్చుమని చెప్పెను. ఇంతలో లక్ష్మణుడు రాముని సమీపించి "సోదరా! నే నీ అన్యాయమును సహించలేను. సైన్యము సంతతిని — భరతుని సహితము — నాశనముచేసి నీ రాజ్యమును నీకు సుస్థిరము చేసెదను. నాకు అనుజ్ఞ ఇమ్ము" అనెను. కాని రామచంద్రుడు తమ్ముని శాంతింపచేసెను. దీనివలన లక్ష్మణుని ఆవేశమునకు గురియైనది భరతుడేనని విశదమగుచున్నది. కారణ మేమి? తన సోదరుడైన భరతునే నాశనము చేయుటకు ఆతనిని పురికొల్పిన దేది? యువరాజ పట్టాభిషేకమునకు భరతుడు ప్రతికక్షి అని లక్ష్మణుడు భావించుట దీనికి కారణము. మరియు ఈ కలత చాలకాలమునుండి బాహాటముగా ప్రబలుచున్నదనికూడ ఇది దృఢపరచుచున్నది. మరియొక విపరీత పరిస్థితి ఏర్పడినది. రాముని తోడ్కొనిరమ్మని కైకేయి మంత్రిని ఆదేశించినప్పటినుండి రాము డరణ్యమునకు బయలు

దేరునప్పటివరకు ఆ మంత్రి రాజసౌధముఖద్వారమునద్ద సమావేశమైయున్న ప్రముఖులతోగాని, పురప్రజలతోగాని, రాజాస్థానములో అతి ప్రధానులైన ఆ మహాముని తోనైనగాని రాజసౌధములో జరుగుచున్న ఆపదనుగూర్చి సంప్రదించలేదు. మహారాజు వసిష్ఠమహామునియొక్క ఆజ్ఞను శిరసావహించి నడచుకొనువారు.

రామలక్ష్మణులను వారి బాల్యదశలోనే మిక్కిలి బలవంతులు, వంచకులు అయిన రాక్షసులను చంపి విశ్వామిత్రుల యొక్క యాగరక్షణము చేయుటకొఱకు వసిష్ఠమహాముని యొక్క ఆజ్ఞప్రకారము దశరథమహారాజు పంపినారు. ఇవన్నియు తెలిసియుండికూడ ఆ మంత్రి వసిష్ఠమహామునితో అప్పుడు జరుగుతున్న విషయముగూర్చి సంప్రదించియుండలేదు. మఱియొక విషయము — ఎవరితో చెప్పినప్పటికిని ప్రస్తుత పరిస్థితులను మార్చలేరు అనికూడ మంత్రి ఎరుగుదురు. అందుచే మహామునితోకూడ ఈ విషయములు చెప్పకనే, వారిసలహాను పొందకనే, రాణియొక్క ఆజ్ఞానుసారము నడచుకొన్నారు. ఈ అన్నిటినిబట్టి చూడగా ఈ విషయములో రాజు నిరపరాధియని దృఢపడుచున్నది. ఆఖరికి సీతారామలక్ష్మణులు ముగ్గురును అరణ్యమునకు వెళ్లిరి.

## 9. భరతుడు కేకయరాజ్యమునుండి అయోధ్యకు తిరిగివచ్చుట:

భరతుడు అయోధ్యకు తిరిగివచ్చుచూ మహాముని ఆజ్ఞానుసారము తనకు వార్తతెచ్చిన దూతలను దారిలో ఇట్లు ప్రశ్నించసాగెను—"అయోధ్యాపురిలో ఏమైనా ఆపదకలిగినదా? ఏమైనా కల్గియున్నచో దానికి నా తల్లిగారేనా కారకురాలు" ఆహా! ఈ ప్రశ్న ఇంత స్పష్టముగా ఎటువంటి సందేహమునకు అవకాశము లేనిదై యున్నది. ఈ ఒక్క ప్రశ్నయే పైన వివరించబడిన. చిరకాలమునుండి అంతఃపురములో కలుగుతున్న, కలహము నిజమని చూపుచున్నది. అటువంటి నిజములు ఇంకా కొన్ని ఇకముందు వివరించుదము. ఈ సందర్భములో మఱియొక ముఖ్యవిషయము గమనించవలసియున్నది. అది యేమనగా భరతునికొఱకు వర్తమానమును పంపినది మహామునియేగాని మంత్రి కాదు. ఆ చీకటి సూర్యోదయమైనప్పటి నుండి రాముడు అరణ్యమునకు వెళ్లినంతవఱకును రాజ్య వ్యవహారాదులలో ఆ ముని యేమియును కలుగచేసుకోలేదు. మంత్రికూడా మహామునియొక్క సలహాను తీసుకోలేదు. వారిని కలియనైనను లేదు. అప్పటివరకూ ఊరకనేయుండి తరువాత మహాముని రాజ్యవ్యవహారములో కలుగచేసుకొనుటకు తగు ముఖ్యకారణము ఏమై యుండును? అది యేమన, ఈ క్రింద వివరించబడును.

సీతారామలక్ష్మణులు అయోధ్యను విడిచి అరణ్యము నకు వెళ్లిననాటినుండి దశరథమహారాజు మరణించునప్పటివఱకు అయోధ్యాపురవాసులందరును మిక్కిలి దుఃఖితులై యుండిరి. ఆ దుఃఖమువలన అయోధ్యాపురి అంతటను చీకటి ఆవరించినది. రాజుయొక్క మరణానంతరము ప్రజలయొక్క దుఃఖము క్రోధ ముగా మారినది. దాని ప్రతిఫలముగా అయోధ్యాపురి అంతట ఆవరించినచీకటి ఎరుపుగా మారినది. ఈ స్థితిలో అయోధ్యా పురిలో రక్తప్రవాహము జరుగుటకు చిహ్నములు కనుపించి నవి. అప్పుడు వసిష్ఠమహాముని తప్ప దేశానికి అంతటి ప్రమాద స్థితి కలుగకుండా రక్షించగల సమర్థులు మఱియొకరు లేరు.

కావున ఆ మహాముని ఈ విషయములో కలుగజేసికొని రాజ్యములో ప్రశాంతత నెలకొల్పెను. అతిత్వరగా బయలుదేరి రావలసినదని ముని ఆజ్ఞగా భరతునికి సమాచారము తెల్పు మని అదే మంత్రితో చెప్పెను. మహామునితీసుకొన్న ఈ చర్య కూడా పైన వివరించిన నిజములకు అనుగుణముగా నున్నది.

ఇప్పుడు స్పష్టముగాను, సందేహమునకు అవకాశము లేని విధముగాను, భరతుడు దూతలతో వేసిన ప్రశ్నలనుగుఱించి చూచుదము.

"అయోధ్యలో ఏమైనా ఆపదకలిగినదా? ఏమైనా కల్గి యున్నచో దానికి మా తల్లియేనా కారకురాలు?"– దీనినిబట్టి

రాజ్యమును కోరవలసినదని భరతుని అతని తల్లి నిర్బంధించుచున్నదనియు, ఆమె ఒత్తిడిని భరించలేకనే భరతుడు తన తాతగారి వద్దకు వెళ్ళి పోయెననియు తెలియుచున్నది. అంతే కాక యీ వివాదము, ప్రస్తుతము అందఱు అనుకొనుచున్నట్లు, హఠాత్తుగా పుట్టినది కాదనియు, మఱియు భరతుడు తన సోదరుడు శ్రీరాముని సేవించుటయే పరమావధిగా నెంచుకొనెననియు స్పష్టమైనది.

సామాన్యులనేగాని దేశప్రముఖులను, నాయకులను వార్తలు పంపడానికి దూతలుగా నియమించుట జరుగదు. సాధారణముగా అట్టి సామాన్యులకు అంతఃపుర రహస్యములు తెలియవు. ఐనను భరతుడు అట్టి వార్తాహరులను ప్రశ్నించుట జరిగినది. కారణ మేమై యుండవచ్చును? అయోధ్యారాజధానిలో కలిగిన ఈ సమస్య, రాణులలో గల విరుద్ధాల మూలమున కలిగిన ఆపదలు రహస్యమైనవై యుండవు. బాహాటముగా ప్రజలందరు ఎఱిగినవే అయి యుండవలెను.

## 10. భరతుడు చూడదలంచినది :

కేకయ రాజ్యమునుండి బయలుదేరి అయోధ్యాపురిలో ప్రవేశించిన తోడనే భరతుడు ఇట్లనెను– "నా సోదరుడగు రామునియొక్క యువరాజపట్టాభిషేకమునకు చేసిన అలం

కారములు చూడగలనని అనుకొంటిని; కాని అవి యేమియు కానరా వేమిటి ?"

దీనిని బట్టి భరతుడు ఇష్టపడి తనంతట తానే అయోధ్యను విడచి తన తాతగారితో కొంతకాల ముండుటకు నిశ్చయించుకొనినట్లును, ఈ నిర్ణయము దశరథుని యొక్కయు, మహామునియొక్కయు ఆమోదముతో జరిగినదనియు, అట్టి సమయములో (భరతుడు లేని సమయములో) రామునికి యువరాజపట్టాభిషేకము జరిపించుటకు ముప్వురును నిశ్చయించుకొనినట్లును నిర్ణయ మగుచున్నది.

భరతుడు చెప్పిన ఈ ఒక్క వాచకమే పైన చెప్పినవి నిజమని ప్రతియొక్కరిలోను దృఢపఱచగలదు. దశరథుడు సభలో నుండి రాగానే రాముని పిలిపించి చెప్పిన దానిని ఇది అనుసరించి యున్నది. ఆ చెప్పినదేమనగా – "చెడు సహవాసముయొక్క వత్తిడి మిక్కిలి బలము గలది. నేను కొన్ని దుశ్శకునములను గంటిని. కనుక రేపే నీకు యువరాజపట్టాభిషేకము జరిగించవలెనని నేను నిశ్చయించితిని. సిద్ధముగ నుండు"మని చెప్పెను. అందువలన ఈ విధముగా, తాను అయోధ్యాపురిలో లేని సమయములో, శ్రీరాముని యువరాజపట్టాభిషేకము జరుపుటకు కలిగిన నిశ్చయానికి భరతుడే మూలకారకుడు.

## 11. 'నీకొఱకే ఈ రాజ్యమును నేను సంపాదించితిని' :

భరతుడు రాజభవనమును చేరిన తోడనే కైకేయి అతనిని చూచి "కుమారా! ఈ రాజ్యమును నేను నీకై సంపాదించితిని. తీసుకొనుము." అని చెప్పెను. ఈ రాజ్యమును మహారాజు నీకు ఇచ్చెనని రాణి చెప్పలేదు. "నేను నీకొఱకు సంపాదించితిని" అని చెప్పెను. అనగా దాని అర్థము - "ఇప్పుడు ఈ రాజ్యము నాది, నీకొఱకే నేను దీనిని సంపాదించితిని. కావున పుచ్చుకొనుము." జరిగిన నిజమిది. అయితే దానితో పాటు రాముని అరణ్యమునకు పంపినది దశరథుడు కాదని, కైకేయియే యని కూడా ఇది నిరూపించు చున్నది. అంతియే కాక ఈ అంశమును గూర్చి మహారాజు నిరపరాధి యని కూడా విశదపరుస్తున్నది. వసిష్ఠమహాముని ఆదేశించిన ప్రకారము పెద్దలు, సేనాపతులు, పుర ప్రముఖులు రాజభవనములో సమావేశమైరి. భరతుని పిలిపించిరి. అప్పుడు మహాముని భరతునితో, "భరతా! నీ తండ్రి ఈ రాజ్యమును నీకు అప్పగించెను. ఆలస్యము చేయక ఈసింహాసనము నధిష్ఠింపుము. నీకు పట్టాభిషేకము చేయుటకు కావలసిన సామానులన్నియును సిద్ధముగా నున్నవి. ఈ కార్యమును జరిపించుట కందఱును వేచియున్నారు. రాజు లేనిదే రాజ్యములో శాంతి నెలకొన"దని చెప్పెను. అందులకు భరతుడు ఇట్లు అనెను. "ఓ మునీంద్రా! నాకు పట్టాభిషేకము చేసినందువలన, నేను

రాజు నయినందువలన, ఈ రాజ్యములో ఎలాగు శాంతి ఏర్పడునో నేను తెలుసుకోలేక పోవుచున్నాను. ఈరాజ్యములో ప్రతి ఒక్కరును నాయొక్క అనుమతితోనే నా తల్లి నా సోదరు డగు నిష్కళంకుడయిన రామచంద్రునిపై కుట్రపన్ని దేశమున కంతటికిని చెప్పలేని ఆపద తెచ్చినదని తలచుచున్నారు. దేశ ములో ప్రతి ఒక్కరు నన్ను నిందించుచున్నారు. అటువంటి నేను సింహాసనముపై కూర్చొనియున్నచో మన రాజ్యములో శాంతి నెలకొనియుండునని మీరు అనుకొనుచున్నారా ?

నా సోదరుడు రామచంద్రుడు తప్ప ప్రపంచములో నన్ను నిరపరాధిగా మరియెవ్వరును అనుకొనుటలేదు. పరిస్థి తులు ఇట్లుండగా మీరు నాకు కిరీటము ధరింపచేయడానికి ఎందుకు ప్రయత్నిస్తున్నారు? ఈ క్షణమే నేను అరణ్యమునకు వెడలి అచటనే రామచంద్రుని పట్టాభిషేకముచేసి వారిని అయోధ్యాపురికి తీసుకురావడమే నా ఉద్దేశము. ఇట్లు చేయ వలెనని నేను నిశ్చయించుకొన్నాను," అని సమాధాన మిచ్చెను. భరతుని యీ నిర్ణయమునకు - మునిశ్రేష్ఠులు, మంత్రిపుంగవులు, పెద్దలు, పురజనులు - ఎల్లరును మిక్కిలి సంతోషభరితులైరి. భరతునిపట్ల వారికిగల అనుమానము తొలగిపోయెను. ఇంచుమించులో అయోధ్యావాసులందరును- రాకుమారుల తల్లులయిన ముగ్గురు రాణులుకూడ - భరతుని వెంట అరణ్యమునకు వెళ్ళుటకును, రామచంద్రుని లోడ్కొని

వచ్చుటకును తీర్మానించుకొనిరి. అరణ్యములోనే పట్టాభిషేకము జరుప నిశ్చయించినందున అందులకై సిద్ధపరచిన సామగ్రి అంతటితోను, సైన్య సమేతముగాను వారందఱు బయలుదేరిరి. ఈ ఘట్టములోనున్న ముఖ్యాంశములను గమనించుదము.

రాముడు అరణ్యమునకువెళ్లు సమయములోకూడ ఎట్టి జోక్యమును కలుగచేసికొనని వసిష్ఠమహాముని తరువాత జోక్యము కలుగచేసికొనెను. కైకేయియొక్క పన్నాగములో భరతుడుకూడ చేరినట్లు రాజ్యములో అందఱును అనుకొనుచుండగా అట్టి అభిప్రాయమును తొలగించి తద్వారా భరతుడు నిరపరాధియని నిరూపించదలచెను. కావుననే బహిరంగసభలో భరతుడు తనయొక్క అభిప్రాయమును వెల్లడిపర్చడానికి అవకాశము కలుగచేసెను. ఈ విధముగా అప్పటి రాజ్యములో ప్రబలియుండిన దారుణ రక్తపాతమునకు అవకాశమిచ్చు చిహ్నములతో కూడుకొనియున్న ప్రజలయొక్క ఉద్రేకతను శమనపరచెను.

## 13. జనకమహారాజు కలుగజేసికొనుట :

అయోధ్యలో జరిగిన వృత్తాంతమును, రాముడరణ్యమునకేగుటయును, రాజర్షి అయిన జనకునకు తెలిసినతోడనే వారు భరతునియొక్క ఉద్దేశ్యము తెలిసికొనుటకు అయోధ్యకు గూఢచారులను పంపిరి. భరతుడు పరివారముతో అరణ్యము

V.R. NARLA MEMORIAL LIBRARY

నకు వెడలిన తరువాత ఆ గూఢచారులు మిథిలానగరమునకు తిరిగి వెళ్ళి అయోధ్యలో జరిగిన సంగతులు జనకమహారాజు నకు ఇట్లు విన్నవించిరి – "భరతుని యొక్క సహృదయత సాటి లేనిది. రామచంద్రునియెడల భరతునకు గల ప్రేమ ఎట్టిదో చెప్పనలవికాదు. రామచంద్రుని తీసికొని వచ్చుటకై భరతుడు అరణ్యమునకు వెళ్ళెను. కాని ఒక్క సంగతి మాత్రము మాకు బోధపడుటలేదు—భరతుడు సైన్య సమేతముగా అరణ్యము నకు వెళ్ళవలసిన అవసరమేమున్నది?"

జనకమహారాజునకదివరకే భరతునిపై అనుమాన ముండుటచేత గూఢచారుల వర్తమానము దానిని మరెంత బలపరచినది. రాముని సోదరులందరూ తనకు సమానముగా సన్నిహితులే అయినప్పటికిని ఆ రాజర్షి ఒక్క భరతుని మాత్రమే ఎందుకు అనుమానించవలసి వచ్చినది? అయోధ్యా పురిసింహాసనమునకు గల హక్కును గురించి ఉన్న భేదములు చాలకాలమునుండి బహిరంగముగా ప్రబలియుండుటయే దీనికి కారణము.

## 14. జనక మహారాజు అరణ్యమునకు వెళ్ళుట :

చివరకు జనకమహారాజు కూడ ఎట్టి విషమపరిస్థితి నైన ఎదుర్కొనుటకు సిద్ధపడి చతురంగసేనాబలములతో అరణ్యములో రాముడున్న చోటికి ప్రయాణమయ్యెను.

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc.No.

రాముడు నివసించుచున్న చిత్రకూటమునకు సమీపమున ఇరు పక్షములవారు - భరతుని పరివారము, జనకుని పరివారము - కలిసికొనిరి. భరతుని కలుసుకొన్నతరువాత జనకమహారాజు భరతుడు నిరపరాధియని తెలుసుకొనెను. కాని లక్ష్మణు డింకను భరతుని అనుమానించుచునే యుండెను. భరతుడు సైన్యసమేతుడై వచ్చుట అతడు చూచెను. "సోదరా! రాజ్యమును పొందినను భరతునికి సంతుష్టి కలుగలేదు. చూడుము! ఇక్కడకూడ మనలను వెంటాడుచున్నాడు. అతడు మన దరికి చేరకముందే నే నాతనిని హతమార్చెదను. నా కనుజ్ఞ నిమ్ము." అని రాముని కోరెను. అయోధ్యలో రాజభవనమువద్ద వారించినట్లే ఇప్పుడుకూడ రాముడు లక్ష్మణుని వారించి శాంతింప చేసెను. ఇంతలో భరతుని పరివారము, జనకుని పరివారము చిత్రకూటమును చేరిరి. అందఱు సీతారామలక్ష్మణులను కలిసికొనిరి.

## 15. చిత్రకూట సమావేశము:

రాముని కుటీరమునకు కొలది దూరములో అందఱును సమావేశమయిరి. రాముడు తన కుటీరములోనే యుండెను. ఈ సమావేశములో వసిష్ఠమహాముని మరియొక సలహా ఇచ్చెను. అది ఏమనగా, "రామునికి బదులుగా భరతుడు పదునాల్గు సంవత్సరములు అరణ్యవాసము చేయుట; రాముడు అయోధ్యకు

తిరిగి వచ్చుట. ఇట్లు జరిగినచో ప్రస్తుతమున్న క్లిష్ట పరిస్థితి చక్కబడును.'' అది విని భరతుడు తన సంతోషమును, ఉత్సాహమును వెలిబుచ్చి, ఆ సలహాను అనుసరించడానికి సిద్ధపడెను. ఈ సలహాను కూడ పరిశీలించుదము. మహాముని అటుల సలహా నిచ్చుటకు కారణ మేమైయుండును? ఇది వింతగా తోచును. కాని మహాముని ఇట్టి సలహా నిచ్చుటకు తగిన కారణముండవలెను.

భరతుని నిరపరాధిత్వమును గుఱించి అయోధ్యా పురవాసులలో ఏ మాత్రమైనను సందేహము ఇంకను ఉన్న యెడల దానిని తొలగించుట, ఒకటి. ఇంతకంటె ముఖ్యమైనది, మరియొకటి - కైకేయి పన్నిన పన్నాగములో భరతుడు నిరపరాధియని మిథిలాపురవాసులకు, జనకమహారాజునకు బోధపఱచుట. రాముడు అరణ్యములో పదునాల్గు సంవత్సరములున్నప్పటికిని రాజ్యమును ప్రశాంతముగా నుంచుటకు ఆ మునీంద్రుడు కృతనిశ్చయుడై అయోధ్యవాసుల ఎదుటను, జనకుని సమక్షములోను ఆ సలహాను ఇచ్చెను. రాముడు తాను చేసికొన్న నిశ్చయమును ఎన్నటికిని మార్చడని తెలిసికూడ అయోధ్యారాజ్యములో శాంతిని నిలబెట్టుటకొఱకు జనకమహారాజు యెదుట, మిథిలాపురవాసులయెదుట ఈ సలహాను ఇచ్చెను.

రామచంద్రుని నిశ్చయమును మఱల్చుటకై చేసిన ప్రయత్నము సఫలము కానందున భరతుడు పాదుకలనైనను

ఇమ్మని ప్రార్థించి, ఆ పవిత్ర పాదుకలను తీసుకొని అయోధ్యకు మరలెను.

## 16. జనక మహారాజుతో రాముడు చేసిన మనవి :

అందఱును చిత్రకూటమునుండి వెళ్ళిపోవుటకు సిద్ధమగుచుండగా రామచంద్రుడు జనకమహారాజును ప్రక్కకు పిలిచి మొట్టమొదట భరతునితో పాటు అయోధ్యకు వెళ్ళి అచట రాజ్యముయొక్క పరిపాలనా విధానమును, సైనిక శాఖను, భాండాగారమును పరీక్షించి అవన్నియు చక్కబెట్టిన తరువాత మిథిలాపురికి వెళ్ళవలసినదిగా కోరెను. రామచంద్రుడు అట్లు అయోధ్యారాజ్యపరిపాలనకు బాధ్యతను జనకునికి అప్పగించెను. అయోధ్య - మిథిల - కేకయ రాజ్యముల సమైక్యతను రామచంద్రు డీవిధముగా సుస్థిరము చేసెను. ఇదికూడ ఈ అంశమునుగూర్చి పైనచెప్పిన నిజములను అనుసరించియే యున్నది.

## 17. పర్ణశాల వృత్తాంతము :

లేడిని పట్టుకొనుటకై బయలుదేరునప్పుడు సీతాదేవిని పరిరక్షించుమనియు, తాను తిరిగివచ్చువరకు పర్ణశాలను విడిచిపెట్టవద్దనియు రాముడు లక్ష్మణుని ఆదేశించెను. ఆ లేడి నెమ్మది నెమ్మదిగా తప్పించుకొనుచు చాలదూరము పోయి

నది. రాముడుకూడ దానిని వెంబడించుచుండెను. దానిని ప్రాణముతో పట్టుకొనుట సాధ్యము కానందున రాముడు తన బాణమును ప్రయోగించెను. దెబ్బ తగిలినవెంటనే ఆ లేడి "హా! సీతా", "హా! లక్ష్మణా" యని అఱచుచూ చనిపోయెను. ఆ కేకలు విని సీతాదేవి రామునికేదో ఆపద సంభవించినదని అనుకొని భయపడెను. అందువలన రాముని సహాయార్థము వెళ్ళుమని సీత లక్ష్మణుని కోరెను. దానిపైన లక్ష్మణుడు "రాముని కట్టి ఆపద కలుగదు. కాన నేను వెళ్ళనక్కఱలేదు." అని సమాధాన మిచ్చెను. అంతట సీత లక్ష్మణుని యుద్దేశ మును శంకించి "లక్ష్మణా! నీ వేదో దురుద్దేశముతో మమ్ము లను అనుసరించుచున్నావు," అనుచు మరల కొన్ని తీవ్రమగు ఆడరాని మాటలాడెను. చిట్టచివరకు "రాముని సహాయా ర్థమై నీవు వెళ్ళనిచో నే నగ్నిలో దూకెద" నని కూడా అనెను. దీనిపైని లక్ష్మణుడు కూడ తీవ్రముగా సమాధానము చెప్పుచు, "సరే! నేనిప్పుడే అన్నగారియొద్దకు పోవుచున్నాను. కాని మేము తిరిగి వచ్చుసరికి మిమ్ములను ఇచ్చట చూడ జాల మని నాకు తోచుచున్నది," అనుచు లక్ష్మణుడు రాముని కొఱకు బయలుదేరెను. సీతాదేవి పర్ణశాలలో ఒంటరిగా నున్న ఆ సమయములో రావణుడు వచ్చి ఆమెను ఎత్తుకొని పోయెను- ఈ విధముగా చరిత్ర చెప్పుచున్నది. దీనిని ఆధార ముగా తీసుకొని దీనిని చదివినవారు, వినినవారు సీతాదేవిని

తీవ్రముగా ఆక్షేపిస్తున్నారు.- అయితే ఇందలి నిజ విషయము లను చూచుదము.

సీతయొక్క రక్షణ కొఱకు అన్ని విధములుగాను సిద్ధముగానుండ వలసినదనియును, నేను తిరిగి వచ్చువరకు అచ్చటనుండి కదలవద్దనియును - రాముడు లక్ష్మణుని ఆజ్ఞాపించెను. రామాజ్ఞ ఇలా ఉన్నప్పటికిని లక్ష్మణుడు పర్ణశాలను విడిచిపెట్టినట్లు చరిత్రములో కనిపించుచున్నది. ఇది ఎట్లు జరిగెను? గ్రంథములో నెచ్చటైనను ఎట్టి పరిస్థితులలో గాని, ఏ కారణంచేతగాని లక్ష్మణుడు రామాజ్ఞను తిరస్కరించినట్లు కనిపించుచున్నదా! లేదు. అట్లుండగా ఈయొక్క ప్రత్యేక సందర్భములో మాత్రము లక్ష్మణుడు ఎట్లు తిరస్కరించి యుండును? ఏ విధముగాను ఇట్లు జరుగుట అసంభవము. బహుశా చనిపోవు వేళప్పుడు ఆ లేడియొక్క పలుకులు విని లక్ష్మణుడు కూడ తప్పు అభిప్రాయము పడి రామునికేదో ఆపద సంభవించినదని తలంచి సీతను ఒంటరిగా వదలిపెట్టి రాముని కాపాడుట కొఱకు పర్ణశాలను విడిచి వెళ్ళియుండునా? లేదు. ఆలాగున జరిగియుండదు. ఏలననగా రామునకు ఎటువంటి ఆపద కలుగదని లక్ష్మణునకు పూర్తిగా తెలిసినదే. అయితే సీతాదేవియొక్క ఆడరాని మాటలువిని ఆ స్థానము విడిచి వెళ్ళియుండెనా? అలా వుండదు. అట్లు జరుగనేరదు. ఎందుచేతననగా మేము తిరిగివచ్చునపుడు "మేము

నిన్ను ఇచ్చట చూడజాలనిమ" లక్ష్మణుడు అనెను. ఈ విష యము పూర్తిగా తెలిసి యున్నప్పుడు సీతను ఒంటరిగా విడిచి లక్ష్మణుడు అక్కడనుండి కదలనేరడు. చరిత్రములో కనిపించు ప్రకారము సీత ఆఖరున చెప్పిన దేమనగా "నీవు రాముని సహాయార్థము వెళ్ళనిచో నేను అగ్నిప్రవేశం చేయుదు"నని. బహుశా సీతయొక్క కఠిన శపథం మూలమున ఆ స్థానం వదలి రాముని వద్దకు వెళ్ళియుండునా ? అది ఎలాగున జరుగును ?

సీతను ఒంటరిగా విడచి వెళ్ళినచో సోదరునితో తాను తిరిగి వచ్చునపుడు సీతను అక్కడ చూడలేమని తెలిసియుండి కూడా లక్ష్మణుడు ఆలాగున చేయునా ? చేయనేరడు. అయితే, లక్ష్మణునకు ఇది విషమావస్థ. సీతను ఒంటరిగా వదిలినచో రామాజ్ఞను తిరస్కరించి నట్లగును. సీత అగ్ని ప్రవేశము చేసెదనని చేసిన 'శపథము' వలన అచ్చటయుండి సీతను కాపాడుట అశక్యము.

సీతను రాక్షసుల మోసకృత్యమునుండి రక్షించుమని రాముని ఆజ్ఞ! అయితే ఇప్పుడు రాక్షసుల చేతిలో పడకుండా కాపాడుటయే కాకుండా సీత తనంత తాను చేసికొన్న కఠిన శపథము నుండి కూడా ఆమెను కాపాడవలెను. ఇట్టి పరిస్థితిలో లక్ష్మణుడు రాముని ఆజ్ఞను నెరవేర్చడానికి, సీతను కాపాడటా

నికి, తనకు అనుకూలమును, శక్యమును అగు విధముగా ఈ క్రింద చెప్పిన పద్ధతి అవలంబించి యుండును.

ఆ విధానమేమనగా లక్ష్మణుడు పర్ణశాల కుటీరమునుండి బయలుదేరి దగ్గరలోనే సీతకు తాను కన్పించనట్లును, తనకు సీత కనుపించునట్లును ఏ పొదచాటునైనా దాగియుండి సీతను కాపాడియుండును. ఇట్లు చేసినపుడు సీత అగ్నిప్రవేశము చేయడానికి అవకాశముండదు. తాను కూడా రామాజ్ఞ నెరవేర్చిన వాడగును.

అయితే, బహుశా లక్ష్మణుడుకూడా ఇవన్నీ ఆలోచించి రాక్షసులు మిక్కిలి బలాఢ్యులు, నేను ఒంటిగా నున్నానుకదా అని తోచి భయంచొప్పున రాముని వద్దకు వెళ్ళియుండెనని యెవ్వరైనను అనుకొనినచో అదియును అసంభవమే అగును. ఎందుచేతననగా చరిత్రములో ఎచ్చటను ఎట్టి పరిస్థితిలోను లక్ష్మణునికి ఏకొద్ది మాత్రమైన భీతానవహం కలిగినట్లు కనిపించుట లేదు. ఈ పైవివరించిన పర్ణశాలగురించిన నిజములనుబట్టి చూడగా ఇది చరిత్రములో కనిపించు విధముగా జరుగలేదు; అయితే, ఇది ఎట్లు జరిగియుండును?

రామలక్ష్మణులు ఇరువురును మామూలు అలవాటు ప్రకారం పర్ణశాలను విడచి వేటకై వెళ్ళియుందురు. ఇందుకు

నిదర్శనముగా సోదరు లిరువురును వేటనుండి తిరిగి పర్ణశాలకు వచ్చినపుడు జరిగిన సంభాషణమును గమనించుదము.

వా రిరువురును వేటనుండి పర్ణశాలకు తిరిగివచ్చినపుడు సీత అక్కడ కనుపించలేదు. కాన రాముడు దుఃఖించసాగెను. అంతట లక్ష్మణుడు "సోదరా! సీతాదేవినిగురించి వ్యాకుల పడకుము. అనేకమార్లు ఆమె దాగుడుమూత లాడుచుండెడిది కదా! అదే ప్రకారం ఇప్పుడుకూడా ఏ పొదచాటునైనా దాగి యుండవచ్చును. కాబట్టి మనమాచోట్లను వెదకుదము. రమ్ము" అని పలికెను. ఇది ఎంత స్పష్టముగా నున్నదో చూడుడు. ఇట్లుగాక, చరిత్రములో కనుపించుచున్నట్లు లక్ష్మ ణుడు ఈ విధముగా - అనగా "మేము తిరిగి వచ్చునపుడు మిమ్ము ఇచ్చట చూడజాలము" - అని చెప్పియుండరు. అదియే నిజమైనచో లక్ష్మణుడు సీతాదేవియొక్క దాగుడుమూతలను గురించి ప్రస్తావించి యుండరు. "ఇచటను, అచటను పొదలలో వెదకుదము" అని పలికియుండరు. దానికి మారుగా "నేను అనుకొన్నట్లుగానే జరిగినది" అని చెప్పియుందురు. కాని అట్లు చెప్పియుండలేదు. ఇవి ఈ అంశమును గురించి గ్రంథములో ఇమిడియున్న నిజములు.

ఈ సమీక్షవలన తేలిన సారాంశమేమనగా - అంతః పురములో చిరకాలమునుండి ప్రబలుచున్న కలతలవలన

శ్రీరాముడు వనవాసముచేయు నవసరము కలిగెను. దీనికి కైకేయియే కారకురాలు. ఈ అంశములో దశరథమహారాజు నిరపరాధి. సీతాదేవి లక్ష్మణునియెడల ఆడరాని మాట లాడ లేదు. అట్టి మాటలు అనుటకు అవసరముకూడా కలుగలేదు. వసిష్ఠమహామునియే రాజ్యములో ప్రబలియున్న ఉద్రిక్తస్థితిని అద్భుతముగా శాంతింపచేసెను. రాముడు అరణ్యవాసము చేస్తున్న పదునాల్గు సంవత్సరములు జనకమహారాజుయొక్క బాధ్యతక్రిందనే అయోధ్యారాజ్యపరిపాలన జరిగినది. కావున శ్రీరాముడు అరణ్యవాసముచేయడానికి కైకేయి మినహా ఇతరులు ఎవరిపైనను నేరము ఆరోపించడానికి ఏమాత్రము అవకాశములేదు.

ఇందు ఉదహరించిన విషయములలో కొన్నిమాత్రమే వాల్మీకి రామాయణములో నున్నవనియు, అన్నియు లేవని ఎందరో అనుకొనుచున్నారు. అయితే వాల్మీకి రామాయణ ములో కనుపించనివి కొద్దిమాత్రమే కాని, అవి తులసీరామా యణములో నున్నవి. పై వివరించిన నిజములకు ఆధారముగా అనేక సందర్భములు ఆ రెండు గ్రంథములలోను ఉన్నవి. కాని కొన్నిటిని మాత్రమే ఇచ్చట వివరించడమైనది.

వాల్మీకి రామాయణనే ప్రామాణికమైన గ్రంథమని, తులసీరామాయణము ప్రామాణికము కాదని అనేకులు అభి

ప్రాయపడుచున్నారు. కాని ఈ అభిప్రాయమునుగూర్చి మరల ఆలోచించవలసియున్నది. వాల్మీకిమహాముని రామాయణ చరిత్ర జరుగకముందే దానిని తన దివ్యదృష్టిచే గ్రహించి ఆ గ్రంథమును వ్రాసెను. అనగా ఈ చరిత్రము జరుగకముందే వ్రాసెను. పరమ భక్తాగ్రేసరుడయిన తులసీదాసు ఆ చరిత్ర జరిగినతరువాత ఆ గ్రంథము వ్రాయుట జరిగినది. కావున తులసీదాసు తన దివ్యదృష్టితో నేకాక వాల్మీకిరామాయణ మునుకూడా చదివి తన గ్రంథమును వ్రాసెను. మహాముని జరుగబోవుదానినిగూర్చియును, మహాభక్తుడు జరిగినదానిని గూర్చియును వ్రాయుట జరిగినది. కావున ఆ రెండు గ్రంథ ములు ప్రమాణంగా తీసుకోవలసినది.

— ప్రెస్, ఎలక్ట్రిక్ ప్రెస్, వాజపేయాజులవారి సందు, కాకినాడ-1

BCP

BC

A0UA104B109

# బాలానంద భక్తబృందంవారి ప్రచురణలు

---

1. Message to Humanity (448 Pages) 10—00
—Swami Balananda

2. Spiritual Enquiry (481 Pages) 10—00
—Swami Balananda

3. ఆధ్యాత్మ విచారణ 8-00
(పై గ్రంథమునకు అనువాదము)-'శారదా-శివం'

4. శ్రీ స్వామి బాలానంద జీవిత విశేషాలు—'నిర్మలం' 5-00

5. Man—Speeches by Swami Balananda 1—50

6. మానవులు 2-00
(పై గ్రంథమునకు అనువాదము)—'శారదా-శివం'

7. Predicament of Youth in our Country 1—00
—Speeches by Swami Balananda

8. మనదేశపు యువకుల క్లిష్ట సమస్య 1-00
(పై గ్రంథమునకు అనువాదము)-'నిర్మలం'

9. రామాయణములో నున్న నిజములు-స్వామి బాలానంద 1-00

ప్రకాశకులు : వి.పి. ఛార్జి అదనం—

బాలానంద భక్త బృందము,
దేవాలయంవీధి, కాకినాడ (ఆంధ్రప్రదేశ్)

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA104B104 |
| పుస్తకం పేరు | ఆంధ్రసాహిత్య చరిత్ర సంగ్రహము |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | 49 |
| వెనుక అట్ట | 49 |
| మొత్తం పేజీలు | 65 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | CI, X, BCI |
| లేని పేజీలు | no |
| తయారు చేసినది | Jayalakshmi |
| పేజీలు విడదీసినది | Jayalakshmi |
| స్కాన్ చేసినది | Hasmat |
| పరీక్ష చేసినది | |
| పేజీలు పరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |